
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
భద్రాద్రి కొత్తగూడెం
ఉష్ణోగ్రత | ఖమ్మం : గరిష్ఠం 34 | కనిష్ఠం 22 | భద్రాద్రి : గరిష్ఠం 36 | కనిష్ఠం 25 | బుధవారం, 21 ఫిబ్రవరి 2024







అయ్యో.. మిర్చి రైతు

- ఈ సారీ తప్పని నష్టాల ఘాటు
- తోటలను దెబ్బతీసిన తామరపురుగు, వైరస్ తెగుళ్లు
- ఎగుమతి ఆర్డర్లున్నా దిగుబడి కరువు
- పెట్టుబడులూ రావడం లేదని రైతుల ఆవేదన

ఖమ్మం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మిర్చి రైతులకు ఈ సీజన్ కూడా కలిసిరాలేదు. తామరపురుగు, ఇతర చీడపీడలు దాడి చేయడంతో దిగుబడులపై తీవ్రంగా ప్రభావం పడింది. కొండంత ఆశతో మిర్చి సాగుచేసిన రైతుల ఆశలు అడియాశలయ్యాయి. ఎండు మిర్చికి ఈ ఏడాది చైనా, మలేషియా, సింగపూర్, తైవాన్ తదితర దేశాలతోపాటు దేశంలోని పలు రాష్ట్రాలకు ఎగుమతి ఆర్డర్లు ఆశాజనకంగా ఉన్నా దిగుబడులు లేక రైతులు నిరాశ చెందుతున్నారు. ధరలు కాస్త నిలకడగా ఉన్నా దిగుబడులు లేకపోవడంతో రైతులకు నష్టాలే మిగులుతున్నాయి. పంట బాగా పండిన రైతులు లాభాలు చూస్తుండగా పెట్టుబడి భారీగా పెట్టినా దిగుబడులు రాని రైతులు నష్టాలు మూటకట్టుకున్నారు. ఈ సంవత్సరం ఎకరాకు 10నుంచి 15క్వింటాళ్లు కూడా దిగుబడి రావడంలేదు. చాలా మంది రైతులకు 10క్వింటాళ్లలోపే దిగుబడి వస్తోం ది. రాష్ట్రంలో ఉమ్మడి జిల్లాలోనే మిర్చి అధికంగా సాగవుతోంది. సుమా రు లక్షా 50వేల ఎకరాల్లో ఈ ఏడాది మిర్చి సాగు చేశారు. అయితే గతేడాది మాదిరిగా ఈ సంవత్సరం కూడా తెగుళ్ల మిర్చి తోటలను తీవ్రంగా దెబ్బతీశాయి.

ఎకరాకు రూ.లక్షపైనే పెట్టుబడి

వాణిజ్య పంటగా ప్రసిద్ధి చెందిన మిర్చి సాగుకు రూ.లక్ష నుంచి లక్షన్నర పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది. ఇంత కష్టపడి సాగు చేసినా పూత, కాత తరుణంలో అకాల వర్షాలు పంటను దెబ్బతీశాయి. వర్షాలతో నాణ్యత దెబ్బతిన్న మిర్చికి మార్కెట్‌లో సరైన ధర కూడా లభించలేదు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఎక్కువగా తేజ రకం మిర్చి సాగు చేస్తారు. ఈ మిర్చికి విదేశాల్లో డిమాండ్ భారీగా ఉంటుంది. ప్రస్తుతం ఖమ్మం మార్కెట్‌కు రోజూ 50వేల నుంచి 70వేల బస్తాలు అమ్మకానికి వస్తున్నాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లాతో పాటు ఉమ్మడి నల్లగొండ, వరంగల్, ఏపీలోని కృష్ణా జిల్లా నుంచి కూడా రైతులు ఇక్కడకు మిర్చి తీసుకొస్తున్నారు. ప్రస్తుతం ఖమ్మం మార్కెట్‌లో క్వింటా మిర్చి అత్యధికంగా రూ.22,300 పలుకుతోంది. నాణ్యత తగ్గితే క్వింటా రూ.20వేల వరకు కొనుగోలు చేస్తున్నారు. ప్రస్తుతం విదేశాలకు ఎగుమతులు ఎక్కువగా ఉన్నందున మిర్చి ధర మరింత పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు పేర్కొంటున్నారు.

తగ్గిన దిగుబడులు

మిర్చిపంట సక్రమంగా పండితే ఖమ్మం జిల్లా రైతులు ఎకరానికి 25నుంచి 35క్వింటాళ్ల వరకు ఉత్పత్తి చేసే అవకాశం ఉంది. తామర పురుగు రాకముందు రెండేళ్ల క్రితం వరకు మిర్చి రైతులు ఎకరానికి కనీసం 30క్వింటాళ్లు పండించి లాభాలు చూశారు. కానీ గతేడాది తామర పురుగు రాకతో మిర్చి రైతులు పూర్తిగా దెబ్బతిన్నారు. ఈ ఏడాది కూడా తామరపురుగు ప్రభావంతో దిగుబడి తీవ్రంగా పడిపోయింది.



రూ.50కోట్ల విలువైన మిర్చి కొనుగోళ్లు
పి.ప్రవీణ్‌కుమార్, ఖమ్మంమార్కెట్ సెక్రటరీ

ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో జనవరిలో మిర్చి కొనుగోళ్లు మొదలయ్యాయి. ఇప్పటి వరకు 3 లక్షల క్వింటాళ్ల మిర్చి కొనుగోలు చేశాం. సుమారు రూ.50కోట్ల విలువైన లావాదేవీలు జరిగాయి. ఈసారి మిర్చి ఎగుమతి ఆర్డర్లు ఉండడంతో మిర్చి కొనుగోళ్లలో పోటీ కనిపిస్తోంది. రాష్ట్రంలో వరంగల్, మహబూబాబాద్, కేసముద్రం తదితర మార్కెట్ల కంటే ఖమ్మం మార్కెట్‌లో మిర్చికి ధర అధికంగా ఉంది. అయితే దిగుబడులు తగ్గడంతో రైతులకు కొంత ఇబ్బంది ఉంది. ఖమ్మం మార్కెట్ నుంచి తేజ రకం మిర్చి అధిక సంఖ్యలో వస్తోంది.



రెండెకరాలకు 15 క్వింటాళ్లే దిగుబడి
మల్లెల కృష్ణ, రైతు, చిరుమర్రి, ముదిగొండ మండలం

రెండు ఎకరాలు మిర్చి వేశాను. కానీ 15 క్వింటాళ్ల దిగుబడే వచ్చింది. ఎకరానికి రూ.లక్షకు పైగా పెట్టుబడి ఖర్చయ్యింది. ఎకరానికి 30క్వింటాళ్లు రావల్సిన దిగుబడి రెండు ఎకరాలకు 15 క్వింటాళ్లే వచ్చింది. తెగుళ్లు, తామరపురుగుతో తీవ్రంగా నష్టపోయా. దిగుబడి బాగా వచ్చి ఉంటే లాభం ఉండేది.



తామర పురుగుతో తీవ్రంగా నష్టపోయా
వేముల రమేష్‌బాబు, ఏన్కూరు

10 ఎకరాల్లో మిర్చి తోట వేశా. ఎకరానికి రూ.లక్ష పెట్టుబడి పెట్టా. గుబ్బతెగులు, తామరపురుగు, నల్లితెగులు వల్ల 10 ఎకరాల్లో కేవలం 16క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. మొత్తం మీద పంట అమ్మితే రూ.2,16,000 వచ్చాయి. తీవ్రంగా నష్టం రావడంతో చివరకు మిర్చి తోట తీసి మొక్కజొన్న వేసుకోవాల్సి వచ్చింది.



ఎనిమిదెకరాల్లో సాగుచేసి అప్పుల పాలయ్యా
వాంకుడోత్ బాబు, భగవాన్‌నాయక్‌తండా

ఈ ఏడాది ఎనిమిదెకరాల్లో మిర్చి సాగు చేసి రూ.7లక్షల అప్పుల పాలయ్యా. 8 ఎకరాలకు మొత్తం రూ.8లక్షలు పెట్టుబడి పెడితే ఎకరానికి కేవలం 3 క్వింటాళ్ల మాత్రమే దిగుబడి వచ్చింది. ప్రస్తుతం మార్కెట్‌లో మర్చికి ధర ఉన్నా దిగుబడులు లేక నషాలే మిగులుతున్నాయి.



రిటర్నింగ్ అధికారి నుంచి ధ్రువీకరణ పత్రం తీసుకుంటున్న రవిచంద్ర

రాజ్యసభకు రేణుక, రవిచంద్ర

ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ప్రకటించిన రిటర్నింగ్ అధికారి



ఖమ్మం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాజ్యసభ ఎన్నికల్లో జిల్లాకు చెందిన ఇద్దరు నేతలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కేంద్రమాజీమంత్రి, ఖమ్మం మాజీ ఎంపీ రేణుకా చౌదరి కాంగ్రెస్ నుంచి, బీఆర్ఎస్‌కు చెందిన ప్రస్తుత రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఉపేందర్‌రెడ్డి ప్రకటించారు. ఈ మేరకు ధ్రువీకరణ పత్రాన్ని రేణుకాచౌదరి బుధవారం రిటర్నింగ్ అధికారి నుంచి తీసుకోనున్నారు. ఆమె మంగళవారం ఢిల్లీ వెళ్లి మర్యాదపూర్వకంగా ఏఐసీసీ పెద్దలను కలిసి హైదరాబాద్ వచ్చారు. బుధవారం అధికారిక ఎన్నిక పత్రాన్ని తీసుకోనున్నారు. కాగా ఎన్నిక ధ్రువపత్రాన్ని వద్దిరాజు రవిచంద్ర మంగళవారం రిటర్నింగ్ అధికారినుంచి తీసుకున్నారు. రవిచంద్రను బీఆర్ఎస్‌కు చెందిన ఎమ్మెల్సీ తాతా మధు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య తదితరులు అభినందించారు.

ఉద్యోగంతో పాటు ఉద్యమాలూ...



- టీజీవో రాష్ట్ర అధ్యక్షుడిగా ఏలూరి శ్రీనివాసరావు ఏకగ్రీవ ఎన్నిక
- సొంత జిల్లా ఖమ్మంలో హర్షాతిరేకాలు
- తెలంగాణ ఉద్యమంలో తనదైన ముద్ర
- ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా నియామకం అయ్యే ఛాన్స్

7



రాట్నాలమ్మ ఆలయంలో మంత్రి తుమ్మల

తెలుగు రైతులు ఆదర్శంగా నిలవాలి

వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

సత్తుపల్లి, ఫిబ్రవరి 20: తెలుగు రాష్ట్రాల రైతులు దేశంలోని ఇతర ప్రాంతాల రైతులకు ఆదర్శంగా నిలవాలని రాష్ట్ర వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆకాంక్షించారు. సత్తుపల్లి సరిహద్దులోని ఏలూరు జిల్లా విజయరాయి సమీపంలోని రాట్నాలమ్మ అమ్మవారి గుడిలో మంగళవారం ఆయన పూజలు నిర్వహించారు. అనంతరం అభిమానులు, ఆంధ్రా ప్రాంతంలోని రైతులతో మాట్లాడారు. ఎన్ని కోట్ల రూపాయలు ఉన్నా రైతులకు వ్యవసాయం మాత్రమే సంతృప్తినిస్తుందని అన్నారు. తనకు రాజకీయంగా వచ్చిన పదవుల కన్నా వ్యవసాయ క్షేత్రంలో ఉండటమే ఇష్టమని చెప్పారు.

పశ్చిమ గోదావరి, ఖమ్మంజిల్లాల్లో రైతులు ఎప్పటికప్పుడు పంటలను మార్చుకుంటూ వచ్చి మొక్కజొన్న, మామిడి పంటలకు ప్రత్యామ్నాయ పంటగా ఆయిల్‌పామ్‌ను సాగు చేస్తున్నారని, దీంతో పాటు వక్క సాగు చేస్తున్నారని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఇతర ప్రాంతాల రైతులు అశ్వారావుపేట, దమ్మపేట ప్రాంతాలలో పామాయిల్ ఇతర ఉద్యానవన పంటలను చూసి ఇక్కడి రైతుల బాటలో నడుస్తున్నారన్నారు.

మొక్కు తీర్చుకున్న తుమ్మల

ఖమ్మం శాసనసభ్యుడిగా గెలుపొందితే విజయరాయి సమీపంలోని రాట్నాలమ్మ అమ్మవారి గుడికి తుమ్మలను తీసుకువస్తామని సత్తుపల్లి మండలానికి చెందిన అభిమానులు మొక్కుకున్నారు. ఈ మేరకు అభిమానుల సూచన మేరకు మంగళవారం మంత్రి తుమ్మల.. రాట్నాలమ్మ అమ్మవారి గుడిని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యుడు చింతమనేని ప్రభాకర్, తుమ్మల అభిమానులు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

పోదాం పద.. మేడారం!

- సమ్మక్క-సారలమ్మ మహాజాతరకు తరలుతున్న భక్తులు
- 'మహాలక్ష్మి' పథకంతో పెరిగిన మహిళల రద్దీ
- ఉమ్మడి జిల్లానుంచి 494 బస్సులు నడుపుతున్న ఆర్టీసీ
- 25 వరకు అందుబాటులో ప్రత్యేక బస్సులు

ఖమ్మం ఖానాపురం హవేలీ/కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, ఫిబ్రవరి 20: దారులన్నీ మేడారం వైపు సాగుతున్నాయి. సమ్మక్క-సారలమ్మ మహాజాతరకు ఉమ్మడి ఖమ్మం జిల్లానుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలుతున్నారు. జాతర ప్రారంభానికి ముందే మూడురోజులుగా వేలసంఖ్యలో భక్తులు మేడారం జాతరకు వెళ్లగా బుధవారం జాతర ప్రారంభం కానుండడంతో జనం పోటెత్తనున్నారు. ఈ జాతరకోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతోంది. ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలోని ఏడు డిపోల పరిధి నుంచి 494 బస్సులను నడుపుతున్నట్లు ఆర్టీసీ రీజనల్ మేనేజర్ సీహెచ్. వెంకన్న తెలిపారు. జాతరకు వెళ్లే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

మహాలక్ష్మి పథకం అమలులో ఉండటంతో ఈ ఏడాది జాతరకు మహిళా భక్తులు అధికసంఖ్యలో వెళ్లే అవకాశం ఉందని తెలిపారు. అందుకు తగ్గట్టుగానే బస్సులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రీజియన్ పరిధిలో మొత్తం 11పాయింట్ల ద్వారా బస్సులను నడుపుతున్నట్లు తెలిపారు. 130 బస్సులు ఖమ్మం రీజియన్ నుంచి, 94 బస్సులు నల్లగొండ నుంచి, హైదరాబాద్ సిటీ నుంచి 270 బస్సులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 25వ తేదీ వరకు ఈ ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. గతంలో ఉన్న సూపర్‌లగ్జరీ, డీలక్స్ బస్సులు యథాతథంగా కొనసాగుతాయని తెలిపారు.

జాతర సందర్భంగా జిల్లాలోని పలు ప్రాంతాల్లో రోజువారీ నడిచే పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ సర్వీసులు రద్దయ్యాయని, కొన్ని రూట్లలో ట్రిప్పుల సంఖ్య తగ్గించినందున ప్రయాణికులు సహకరించి ప్రత్యామ్నాయం చూసుకోవాలని తెలిపారు. ఖమ్మం నుంచి 30, ఇల్లెందు 124, వెంకటాపురం 11, ఏటూరునాగారం 34, చర్ల 10, మణుగూరు 25, మంగపేట 10, కొతగూడెం 130, టేకులపల్లి 25, పాల్వంచ 45, భద్రాచలం 50 మొత్తం 494 బస్సులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గత రెండు రోజులుగా భక్తులు అధిక సంఖ్యలో మేడారం జాతరకు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తున్నారని, జాతర ముగిసే వరకు ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సులు నడుపుతామని తెలిపారు. కొత్తగూడెం నుంచి గత మూడు రోజుల్లో సుమారు 4500మంది భక్తులు మేడారానికి వెళ్లారు. వీరిలో 50శాతం మహిళా ప్రయాణికులు ఉన్నారు.



కొత్తగూడెం ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సు ఎక్కుతున్న మేడారం భక్తులు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీమంత్రి పువ్వాడ

బీఆర్ఎస్ శ్రేణులు ప్రజాక్షేత్రంలోకి వెళ్లాలి..

- పార్లమెంట్ ఎన్నికలకు సిద్ధం కావాలి
- మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

ఖమ్మం కార్పొరేషన్, ఫిబ్రవరి 20: రానున్న పార్లమెంట్ ఎన్నికలకు సిద్ధం కావాలని, బీఆర్ఎస్ శ్రేణులు ప్రజాక్షేత్రంలోకి వెళ్లాలని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం మమత ఆస్పత్రి ప్రాంగణంలోని తన నివాసంలో బీఆర్ఎస్ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. తొలుత బీఆర్ఎస్ శ్రేణులతో సమావేశం నిర్వహించిన పువ్వాడ అనంతరం బీఆర్ఎస్ కార్పొరేటర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా పువ్వాడ మాట్లాడుతూ ఖమ్మం ఎంపీ, ఎమ్మెల్సీ పదవులు మనకున్నా, ఖమ్మం నియోజకవర్గ బాధ్యత మాత్రం కార్పొరేటర్లదేనన్నారు. బీఆర్ఎస్ ఓడిపోయినంత మాత్రాన ఎవరూ అధైర్య పడవద్దని, బీఆర్ఎస్ శ్రేణులకు తాను అండగా ఉంటానని పువ్వాడ పేర్కొన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థికి ఖమ్మం నియోజకవర్గంలో అత్యధిక మెజార్టీ వచ్చేలా బీఆర్ఎస్ శ్రేణులు కృషి చేయాలని దిశానిర్దేశనం చేశారు. ఎన్నికల్లో గెలుపు, ఓటములు సహజమని, ఒకసారి ఓడిపోయినంత మాత్రాన కుంగిపోవద్దని పువ్వాడ పేర్కొన్నారు. మనకు ముందు మంచిరోజులు వస్తాయి, మునుపటి ఉత్సాహంతో పనిచేయాలని కోరారు.

బీఆర్ఎస్‌ను వీడవద్దు

బీఆర్ఎస్ కార్పొరేటర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించిన పువ్వాడ... వారిని పార్టీ మారవద్దని సూచించారు. ప్రస్తుతం అధికారంలో ఉన్నది బీఆర్ఎస్ కార్పొరేటర్లేనని, బీఆర్ఎస్‌ను బలోపేతం చేయాల్సిన బాధ్యత వారికుందన్నారు. పార్లమెంట్ ఎన్నికల అనంతరం పలువురు బీఆర్ఎస్ కార్పొరేటర్లు పార్టీ వీడుతారని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో పువ్వాడ కార్పొరేటర్లతో సమావేశం కావటం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఓపికతో పనిచేయాలని, కష్టపడి గెలిపించుకున్న కార్పొరేటర్లపై పార్లమెంట్ ఎన్నికల్లో అభ్యర్థికి మెజారిటీ తెచ్చే బాధ్యతను అప్పగిస్తున్నానని పేర్కొన్నారు. సమావేశంలో మేయర్ పునుకొల్లు నీరజ, డీసీసీబీ మాజీ ఛైర్మన్ కూరాకుల నాగభూషయ్య, సుడా మాజీ ఛైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, సీనియర్ నాయకులు గుండాల కృష్ణ, కార్పొరేటర్లు, డివిజన్ నాయకులు పాల్గొన్నారు.



మార్కెట్ సెక్రెటరీతో మాట్లాడుతున్న మిర్చి రైతులు

మార్కెట్‌కు అనధికార సెలవు

- కొనుగోళ్లు జరగక మిర్చి రైతుల ఆందోళన
- వ్యాపారుల తీరుపై నిరసన
- సెక్రటరీ జోక్యంతో కొనసాగిన కొనుగోళ్లు
- రేపు, ఎల్లుండి మార్కెట్‌కు సెలవులు

ఖమ్మం మార్కెట్, ఫిబ్రవరి 20: ఖమ్మంనగరంలోని వ్యవసాయ మార్కెట్‌కు కొంతమంది వ్యాపారులు ప్రకటించుకొన్న అనధికార సెలవు అన్నదాతల నిరసనకు కారణమైంది. మంగళవారం సెలవు విషయం సమాచారం లేని రైతులు తమ పంటలను మార్కెట్‌కు తీసుకొచ్చారు. అయితే పంటను ఎవరూ కొనుగోలు చేయకపోగా, కొన్న కొద్ది పంటను కాంటాలు వేయకపోవడంతో మిర్చి రైతులు ఆందోళనకు దిగారు.

సోమవారం సుమారు లక్ష మిర్చి బస్తాలకుపైగా అమ్మకానికి రావడంతో కాంటాలు, తోలకాలు ఆలస్యమై కొంత పంట పెద్ద మార్కెట్ యార్డులలోనే ఉంది. దీంతో వ్యాపారులు మిర్చి మార్కెట్‌కు మంగళవారం సెలవంటూ సోషల్‌మీడియాలో పోస్టులు చేశారు. కాగా సెలవు విషయం సమాచారం లేని రైతులు సుమారు 10వేల బస్తాలను తీసుకొచ్చారు. దీంతో మార్కెట్ అధికారులు వచ్చిన పంటను చిన్న యార్డులో దిగుమతి చేయించారు. అనంతరం పంటను కొంతమంది వ్యాపారులు కొనుగోలు చేసినటప్పటికీ వాటిని కాంటాలు వేయడానికి మార్కెట్ సెక్రెటరీ ప్రవీణ్‌రెడ్డి నిరాకరించారు. దీంతో రైతులు మార్కెట్ సెక్రెటరీ చాంబర్‌కు చేరుకొని కొద్దిసేపు ఆందోళన చేసి తమ గోడును వెళ్ళబోసుకున్నారు. దీంతో సెక్రెటరీ ప్రవీణ్‌రెడ్డి కాంటాల ప్రక్రియను ప్రారంభించాలని మార్కెట్ సిబ్బందిని ఆదేశించారు. కాంటాలు వేయడానికి దడవాయిలు అందుబాటులో లేకపోవడంతో పంటను తక్కువ ధరకు కొనుగోలు చేసి వారే కాంటాలు వేసుకున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

రేపు, ఎల్లుండి మార్కెట్‌కు సెలవులు

నగరంలోని వ్యవసాయ మార్కెట్‌కు ఈనెల 22, 23 తేదీలు (గురు, శుక్రవారాలు) మేడారం సమ్మక్క సారక్క జాతర సందర్భంగా సెలవులు ఇచ్చినట్లు మార్కెట్ సెక్రెటరీ పి.ప్రవీణ్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 24 శనివారం నాడు మిర్చి కొనుగోళ్ళు జరపాలని నిర్ణయించినట్లు తెలిపారు.

మహిళల సంక్షేమమే ధ్యేయం

- లోక్‌సభ ఎన్నికల్లో మహిళా చైతన్యం చాటాలి
- కాంగ్రెస్ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావు



మాట్లాడుతున్న సునీతారావు

ఖమ్మం సంక్షేమ విభాగం, ఫిబ్రవరి 20: రాష్ట్రంలోని బాలికల నుంచి మహిళల వరకు కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా సమృద్ధికి కట్టుబడి ఉందని అందుకే కాంగ్రెస్ ఆరుగ్యారెంటీ పథకాల్లో మహిళల సంక్షేమ పథకాలను రూపొందించి అమలు చేస్తుందని, రానున్న లోకసభ ఎన్నికల్లో ఉమ్మడి ఖమ్మంజిల్లాలోని మహిళలు మరోసారి తమ రాజకీయ చైతన్యాన్ని చాటాలని రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మొగిలి సునీతారావు పేర్కొన్నారు. జిల్లా పర్యటనకు వచ్చిన ఆమె మంగళవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవన్‌లో జిల్లా అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య అధ్యక్షతన నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీ పథకాల ద్వారా మహిళలు ఆర్థిక, సామాజిక అభివృద్ధికి దోహద పడుతుందన్నారు. లోకసభ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు మహిళలకు డబ్బులు పంపిణీ చేస్తే ఆ డబ్బులు తీసుకొని కాంగ్రెస్‌కే ఓటేయాలని కోరారు. ఆయా పార్టీలు పంచే డబ్బులు రాష్ట్ర ప్రజలను దోచుకున్నవే అని ఆరోపించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షురాలు దేవీప్రసన్న పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు చేరాలి



- ఆరు గ్యారెంటీలలో రెండు అమలయ్యాయి
- జడ్పీ సర్వసభ్య సమావేశంలో చైర్మన్ కంచర్ల
- వైద్య సిబ్బంది అంకిత భావంతో పనిచేయాలి: ఎమ్మెల్యే కూనంనేని

6

గొర్రెల పంపిణీలో ఇష్టారాజ్యం



- అంబులెన్సు వాహనాల నెంబర్లనూ వాడుకున్నారు..
- 'కాగ్' నివేదికలో అక్రమాలు బట్టబయలు
- బాధ్యులైన 27 మందికి షోకాజ్ నోటీసులు

7

వీవీ పాలెం సొసైటీ కాంగ్రెస్ కైవసం

7


మేడారం జాతరకు తరలివస్తున్న భక్తులు

జన జాతరకు వేళాయె..

నేటి నుంచి మేడారం కుంభమేళా ప్రారంభం

నేడు గద్దెకు చేరుకోనున్న సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజులు
నాలుగు రోజుల పాటు పూజలందుకోనున్న వనదేవతలు

వరంగల్, ఫిబ్రవరి (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మేడారం జనారణ్యం అవుతోంది. వనదేవతల ఆగమనానికి వేళవుతుండటంతో భక్తులతో మేడారం పోటెత్తుతోంది. ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న అద్భుత క్షణాలు బుధవారం సాక్షాత్కరించనున్నాయి. తొలిరోజు సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజులు గద్దెకు చేరుకుంటారు. ఈ నేపథ్యంలో మేడారం జనగుడారమవుతోంది. ఎడ్లబండ్లు, కాలి నడకన, కార్లు, ఆటోలు, జీపులు, బస్సుల్లో భక్తులు మేడారం చేరుకుంటున్నారు.

నేటి నుంచి జాతర

తెలంగాణ కుంభమేళాగా పిలిచే మేడారం సమ్మక్క, సారలమ్మ జాతర బుధవారం నుంచి ప్రారంభం కానుంది. రెండేళ్లకోసారి మాఘశుద్ధ పౌర్ణమిన రోజైన బుధవారం నుంచి శనివారం వరకు నాలుగు రోజుల పాటు ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని దట్టమైన అరణ్యంలోని మేడారంలో జరిగే ఈ మహాజాతరకు తెలుగు రాష్ట్రాలతో పాటు పొరుగున ఉన్న ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఒరిస్సా రాష్ట్రాల నుంచి భక్తులు భారీగా తరలివస్తారు. పూర్తిగా ఆదివాసీ సంప్రదాయ పద్ధతిలో జరిగే ఈ జాతరలో ప్రకృతే దైవంగా.. వనదేవతల స్మారకార్థం నిర్మించిన కర్రల వద్దే పూజలు నిర్వహిస్తారు. వనదేవతలకు పసుపు, కుంకుమ, ఒడి బియ్యం, ఎదుర్కోళ్ల తో పాటు బంగారాన్ని (బెల్లం) మొక్కుగా చెల్లిస్తారు.

గద్దెపైకి చేరిన జంపన్న

జాతర నేపథ్యంలో సమ్మక్క తనయుడు జంపన్న కన్నెపల్లి నుంచి మంగళవారం రాత్రి 8గంటలకు జంపన్న వాగు ఒడ్డునున్న గద్దెకు చేరుకున్నారు. పోలెబోయిన వంశీయులు పూజారి సత్యం ఆధ్వర్యంలో పగిడె రూపంలో ఉన్న జంపన్నను గద్దెపై కొలువుదీర్చి పూజలు చేశారు.


సమ్మక్క గద్దె

నేడు గద్దెకు చేరనున్న సారలమ్మ

జాతర తొలిరోజున కన్నెపల్లి ఆడపడుచు సారలమ్మ గద్దెపైకి రానుంది. సారలమ్మ కొలువైన పల్లె కన్నెపల్లిలో బుధవారం ఉదయమే ప్రధాన పూజారి కాక సారయ్య ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. సారయ్యతోపాటు మిగతా పూజారులు ఆలయాన్ని శుద్ధి చేసి అలికి ముగ్గులతో అలంకరిస్తారు. సాయంత్రం ఆలయంలో ఆదివాసీ పూజారులు రహస్య పూజలు జరుపుతారు. ఈ సమయంలోనే పూజారి సారయ్యను సారలమ్మ ఆవహిస్తుంది. సారయ్యకు పూనకం రావడంతో ఆలయం నుంచి గద్దెల వైపు పూజారులు సారలమ్మను తీసుకవస్తారు. కన్నెపల్లి మీదుగా తన తమ్ముడు జంపన్నను పలకరిస్తూ జంపన్నవాగును పూజారులు దాటుతారు. ఈ సమయంలోనే శివసత్తుల పూనకాలతో భక్తుల పుణ్యస్నానాలతో జంపన్నవాగు పులకరిస్తుంది. కన్నెపల్లి నుంచి మేడారంలో ఉన్న సమ్మక్క ఆలయానికి సారలమ్మ చేరుకుంటుంది.


వనదేవతలకు మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

పగిడిద్దరాజు, గోవిందరాజుల రాక

మంగళవారం మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం పూనుగొండ్ల నుంచి సమ్మక్క భర్త పగిడిద్దరాజు మేడారం బయలుదేరారు. ఆదివాసీలు కాలినడకన పగిడిద్దరాజును పడిగె రూపంలో తీసుకుని బుధవారం సాయంత్రానికి మేడారంలోని సమ్మక్క గుడికి చేరుకుంటారు. ఇక పగిడిద్దరాజు తమ్ముడు గోవిందరాజులు కూడా బుధవారమే ఏటూరునాగారం మండలం కొండాయి నుంచి బయలుదేరి, మేడారం చేరుకుంటారు. సమ్మక్క ఆలయంలో ముగ్గురికి ప్రత్యేక పూజలు చేస్తారు. అనంతరం రాత్రి 8గంటలకల్లా మేడారంలోని గద్దెలపైకి చేరుకుంటారు. దీంతో తొలిరోజు జాతర అట్టహాసంగా ప్రారంభం అవుతుంది.

23న మొక్కులు

జాతరలో మూడోరోజు శుక్రవారం గద్దెలపై సమ్మక్క, సారలమ్మల తోపాటు పగిడిద్దరాజు, గోవిందరాజులు చేరుకోవటంతో భక్తులు రాత్రి పగలు తేడా లేకుండా మొక్కులు చెల్లించేందుకు బారులు తీరుతారు. 23వ తేదీ శుక్రవారం వనదేవతలకు మొక్కులు చెల్లింపులు చేస్తారు. తీరొక్క మొక్కులతో వనదేవతలను శరణ కోరుతారు.

22న సమ్మక్క ఆగమనం

జాతరలో రెండోరోజైన గురువారం 22న మేడారంలోని చిలుకలగుట్టపై రహస్య ప్రాంతంలో సమ్మక్క ప్రధాన పూజారి కొక్కెర కిష్టయ్యతో పాటు వడ్డెలు మునిందర్, బొక్కయ్య ప్రత్యేక పూజలు చేస్తారు. అనంతరం కుంకుమ భరణె రూపంలో ఉన్న సమ్మక్కను తీసుకుని ప్రధాన పూజారి కిష్టయ్య చిలుకలగుట్టపై నుంచి కిందకు వస్తున్న క్రమంలో ములుగు ఎస్పీ గాలిలోకి కాల్పులు జరిపి సమ్మక్క రాకను స్వాగతిస్తారు. ఆ సమయంలో కోట్లాది భక్తుల జయజయ నినాదాలతో మేడారం హోరెత్తుతుంది. సమ్మక్క ఆగమనంతో దారి పొడువునా వేలాది మేకలు, గొర్రెలు, కోళ్ల తలలు తెగి రక్తం చిందిస్తాయి. పూజారులు అత్యంత భక్తిశ్రద్ధలతో రాత్రి 10గంటల కల్లా సమ్మక్క గద్దెకు చేరుకోవటంతో మహాజాతర తుది ఘట్టానికి చేరుకుంటుంది.

24న వనప్రవేశం


జాతరలో చివరి రోజైన నాలుగో రోజు శనివారం సాయంత్రం 6గంటలకు సమ్మక్క తిరిగి చిలుకలగుట్టకు తిరుగు ప్రయాణం అవుతుంది. సమ్మక్క వన ప్రవేశంతో సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజులు కూడా వారి స్వగ్రామాలకు పయనం అవుతారు. దీంతో జాతర ముగుస్తుంది.


కన్నెపల్లి నుంచి జంపన్నను గద్దెపైకి తీసుకొచ్చి ప్రతిష్ఠిస్తున్న వడ్డెలు


మేడారం దారిలో వాహనాల బారులు..


మంగపేట మండలం కమలాపురం నుంచి ఎడ్లబండ్లపై జాతర కొస్తున్న భక్తులు


సారలమ్మ గద్దె



విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

తిరుమలాయపాలెం, ఫిబ్రవరి20: విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం మండలంలో జరిగింది. మండలంలోని కొక్కిరేణి గ్రామానికి చెందిన గద్దల గోపయ్య (60) వ్యవసాయ కూలీగా జీవిస్తున్నాడు. మంగళవారం ఇంట్లోకి కోతులు రాగా వాటిని తరిమే క్రమంలో ఇంటి రేకులను ముట్టుకున్నాడు. దీంతో విద్యుదాఘాతానికి గురై గోపయ్య స్పృహ తప్పి కింద పడిపోయాడు. స్థానికు లు 108 సహాయంతో ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గోపయ్యను పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జామాయిల్ ప్లాంటేషన్‌కు నిప్పు

సత్తుపల్లిరూరల్, ఫిబ్రవరి20: జామాయిల్ ప్లాంటేషన్‌కు కొందరు ఆకతాయిలు నిప్పు పెట్టిన సంఘటన మంగళవారం సత్తుపల్లి మునిసిపాలిటీలో చోటుచేసుకుంది. స్థానిక నీలాద్రి అర్బన్ పార్క్‌కు ఆనుకుని ఉన్న అటవీ కార్పొరేషన్‌కు చెందిన 5హెక్టార్ల జామాయిల్ ప్లాంటేషన్ సాగులో ఉన్నది. ఈ క్రమంలో గుర్తు తెలియని కొందరు ఆకతాయిలు ప్లాంటేషన్‌కు నిప్పు పెట్టడంతో దావనంలా వ్యాపించి చెట్ల కింద నున్న ఆకులకు అంటుకుంది. బేస్‌క్యాంప్ సిబ్బంది సమాచారం ఇవ్వడంతో వాచర్లతో పాటు, సత్తుపల్లి ఫైర్‌స్టేషన్ నుంచి ఫైరింజన్‌తో మంటలను ఆర్పివేసినట్లు ప్లాంటేషన్ మేనేజర్ సైదానాయక్ తెలిపారు.

గ్యాస్ సిలిండర్ల పట్టివేత

మణుగూరు, ఫిబ్రవరి 20: హోటల్‌లలో గృహ అవసరాలకు వినియోగించే 11 సిలిండర్లను సివిల్ సప్లయ్ అధికారులు పట్టుకున్నారు. మంగళవారం సివిల్ సప్లై అధికారి డీటీ శివకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మణుగూరు పట్టణంలోని అశోక్‌నగర్, టీడీపీ సెంటర్, పాత పెట్రోల్ బంక్ ప్రాంతాల్లోని హోటల్‌లపై దాడులు నిర్వహించి అక్రమంగా వినియోగిస్తున్న గృహ అవసరాల 11 గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

సంక్షేమ పథకాలు అందించాలి

● జడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖరరావు

కొత్తగూడెం, ఫిబ్రవరి20 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు చేరేలా చర్యలు చేపట్టాలని జడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖరరావు అన్నారు. మంగళవారం జడ్పీ కార్యాలయంలో వివిధ సంక్షేమ శాఖలపై నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీల పథకాలలో రెండు అమలయ్యాయని అన్నారు.

సభ్యులు లేవనెత్తిన అంశాలపై కలెక్టర్, అధికారులు స్పందించాలని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కోరారు. మాతా శిశు ఆసుపత్రి నిర్వహణపై చర్యలు తీసుకోవాలని, బెడ్స్‌పై దుప్పట్లను ఎప్పటికప్పుడు మార్చాలని, సిబ్బంది కొరత లేకుండా చూడాలని అన్నారు. జడ్పీ నూతన కార్యాలయ నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని కోరారు.

గిరిజనులు, గిరిజనేతరులు నిర్మించుకున్న ఇళ్లకు ఇంటి నెంబర్లు కేటాయించాలని వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ అన్నారు. కాగా 1/70 యాక్టు ఉన్నందున ఇంటి నెంబర్లు కేటాయించలేమని కలెక్టర్ తెలిపారు.

ప్రభుత్వం నుంచి అధిక నిధులు తెప్పించి గ్రామాలను అభివృద్ధి చేసుకుందామని భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు అన్నారు.

అనంతరం కలెక్టర్ ప్రియాంక అలా మాట్లాడుతూ గత సమావేశంలో లేవనెత్తిన సమస్యలకు పూర్తి సమాచారం ఇవ్వలేకపోయామని, అధికారుల బదిలీల వల్ల వీలు పడలేదన్నారు. అభివృద్ధి పనులకు ఎల్లవేళలా సిద్ధంగా ఉంటామన్నారు. ఈ సమావేశంలో డీఆర్‌డీవో విద్యాచందన, జడ్పీ సీఈవో ప్రసూనారాణి తదితరులు పాల్గొన్నారు.

వెటర్నరీ కోర్సులో సీటు ఇప్పిస్తామని టోకరా

● ప్రజావాణి, పోలీస్ స్టేషన్లో బాధితుల ఫిర్యాదులు
● న్యాయం చేయాలని వేడుకోలు

బోనకల్, ఫిబ్రవరి 20: సాంకేతిక పరిజ్ఞానంతో వేగంగా దూసుకుపోతున్న నేటి సమాజంలో మోసాలు కూడా అదే రీతిలో పెరుగుతున్నాయి. పిల్లల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని కష్టపడి వెనుకేసిన సొమ్ము కొందరిదైతే, అప్పులు చేసి ఉన్నత చదువులను పూర్తి చేయించాలన్న తపన మరి కొందరిది. కాని కొందరు కేటుగాళ్లు తల్లిదండ్రుల బలహీనతలను ఆసరాగా చేసుకొని ఉన్నత చదువులు, ఉద్యోగాలు ఇప్పిస్తామని కన్సల్టెన్సీల పేరుతో లక్షలాది రూపాయలను వసూలు చేసి బోర్డు తిప్పేస్తున్నారు. మోసపోయిన బాధితులు పోలీస్ స్టేషన్లు, ప్రజా ప్రతినిధుల వద్దకు వెళ్లి ఫిర్యాదులు చేస్తున్నారు. న్యాయం చేయాలని తమలా మరొకరు మోసపోకుండా ప్రజా ప్రభుత్వం లోనైనా కఠిన చర్యలు తీసుకోవాలని వేడుకుంటున్నారు.

మోసపోయిన పలువురు బాధితులు

ఇంటర్ మీడియట్ పూర్తైన తరువాత నిర్వహించే ఎంసెట్ పరీక్షలో మెరిట్ మార్కులు రాని విద్యార్థులు ఎంబీబీఎస్, వెటర్నరీ తదితర కోర్సుల్లో చేరేందుకు బెంగుళూరు, చెన్నై పట్టణాలల్లో ఉన్న కళాశాలల్లో సీట్లు ఇప్పిస్తామని ఇంటర్ విద్యార్థుల తల్లిదండ్రుల ఫోన్ నంబర్లకు కన్సల్టెన్సీ పేరుతో మెసేజ్‌లు వచ్చాయి. దీంతో గత ఆగస్టు నెలలో ఖమ్మం జిల్లా బోనకల్ మండలం ముష్టికుంట్ల ఉన్నత పాఠశాల హెచ్ఎంగా పని చేసిన బాలిన చలపతిరావు తన కుమారుడి కి వెటర్నరీ కోర్సులో సీటు కావాలని తనకు వచ్చిన మెసేజ్‌లోని ఫోన్ నంబర్‌ను సంప్రదించగా, సీటు ఇప్పిస్తానని హైదరాబాద్‌కు రావాలని కన్సల్టెన్సీ నిర్వాహ కుడు అడ్రస్ చెప్పాడు. దీంతో హైదరాబాద్‌లోని వెళ్లి కన్సల్టెన్సీ నిర్వాహకులను కలిశాడు.

దీంతో హైదరాబాద్‌లో దిల్‌సుఖ్‌నగర్ వద్ద గల పోచమ్మ టెంపుల్ లైన్ 3-43/1, మెట్రో పిల్లర్ నంబర్ 1555, చైతన్యపురి అడ్రస్‌కు వెళ్లారు. మిలీనియం రెసిడెన్సీ పక్కన అభి ఫ్యూచర్స్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో ఉన్న కార్యాలయంలో సదరు నిర్వాహకుడు తన పేరు అభి నాయక్ అని పరిచయం చేసుకొని మీకు కావాల్సిన వెటర్నరీ కోర్సు సీటును మేనేజ్‌మెంట్ కోటాలో బెంగుళూరులో ఇప్పిస్తానని చెప్పాడు. అక్కడే వేరే వారికి ఫోన్ చేసి బెంగుళూరులో తాను సీటు ఇప్పించిన విద్యార్థి తండ్రితో మాట్లాడమని పథకం ప్రకారం మాట్లాడించాడు. దీంతో నమ్మకం కుదిరిందని చెప్పడంతో మొదట రూ. 2.5 లక్షలు కడితే సీట్ ఓకే అవుతుందనడంతో డబ్బు కట్టాడు. ఆ తరువాత అక్టోబర్ నెలలో రెండో విడత రూ. 1.5 లక్షల డబ్బును కట్టాడు. ఆయనతో పాటు మధిరకు చెందిన సుతారి మేస్త్రీ తన కుమారుడి సీటు కోసం ఇదే రీతిలో డబ్బు కట్టాడు. హైదరాబాద్, విజయవాడ, కాకినాడ, అనంతపురం తదితర ప్రాంతాలల్లో పదుల సంఖ్యలో సీట్ల కోసం డబ్బులు కట్టి మోసపోయినట్లు పలువురు బాధితులు చైతన్యపురి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ప్రజావాణిలో కూడా ఫిర్యాదు ఇచ్చారు. డబ్బులు కట్టిన వారి అడ్రస్‌ను విద్యార్థుల తల్లిదండ్రులకు ఇచ్చి తెలివిగా వారితో మాట్లాడమని చెప్పి కొత్తవారిని బుట్టలో వేసుకున్నాడు. కట్టిన డబ్బులకు ప్రామిసరీ నోట్లు, ఖాళీ చెక్కులు కూడా ఇవ్వడంతో ఎటువంటి అనుమానం రాలేదు. డబ్బులు కట్టించుకున్న వ్యక్తి అడ్రస్ ఆధార్‌కార్డులో అనంతపురం జిల్లా నగినాయని చెరువుతండగా ఉందని ఇచ్చిన ఫోన్ నంబర్ల సిమ్‌లను తొలగించడంతో పాటు కన్సల్టెన్సీ నడుపుతున్న భవనం వద్ద కూడ ఆనవాళ్లు కనిపించక పోవడంతో బోర్డు తిప్పేసినట్లు తెలుసుకొని బాధితులు లబోదిబోమంటున్నారు.

సీతారామ లింక్ కెనాల్‌పై ఆందోళనొద్దు: ఎమ్మెల్యే


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

ఏన్కూరు, ఫిబ్రవరి20: సీతారామ లింక్ కెనాల్‌పై ఆందోళన చెందవద్దని ఎమ్మెల్యే రాందాస్ నాయక్ అన్నారు. మంగళవారం స్థానిక రైతు వేదికలో ఇరిగేషన్ శాఖ అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష సమావేశం నిర్వహించారు. 1/70చట్టానికి పీసీ చట్టానికి విరుద్ధంగా గ్రామసభ ఆమోదం తెలపకుండానే ప్రాజెక్టు నిర్మాణానికి అధికారులు సిద్ధమవుతు న్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గిరిజన రైతులకు నష్టం కలిగించే లింక్ కెనాల్‌ను నిలుపుదల చేయాలని ఇరిగేషన్ శాఖ అధికారులను ఆదేశిం చారు. మరో రెండు మూడు చోట్ల సర్వే నిర్వహించి వైరా చెరువును నింపే విధంగా డిజైన్‌ను సిద్ధం చేయాలని ఆదేశించారు. ఐదు మండలాలల్లోని చెరువులను నింపే విధంగా ప్రణాళికలు తయారుచేయాలని కోరారు. సన్న, చిన్నకారు గిరిజన రైతులే ఎక్కువ మది ఉన్నారని వీరంతా భూములు కోల్పోయి బజారును పడాల్సి వస్తుందని వెంటనే లింక్‌కెనాల్‌ను నిలుపుదల చేయాలని వేడుకున్నా రు. ఈకార్యక్రమంలో సొసైటీ చైర్మన్ శెట్టిపల్లి వెంకటేశ్వరరావు, ఇరిగేషన్ ఎస్ఈ ఎస్.శ్రీనివా సరెడ్డి, ఈఈ బి.అర్జున్, డీఈ చంద్రశేఖర్, జేఈ సాగర్, మేడా ధర్మారావు, వెనిగళ్ల శ్రీహరి, మాలోతు నరసింహారావు, బాలాజీ, వక్కంతుల నాగార్జున, దళపతి భువనేశ్వరరాజు పాల్గొన్నారు.

కొత్తగూడెంలో నలుగురు బంగ్లాదేశీయుల అరెస్టు

● నకిలీ ధ్రువపత్రాలతో అక్రమంగా నివసిస్తున్నట్లు గుర్తింపు

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, ఫిబ్రవరి 20: అక్రమంగా దేశంలోకి చొరబడి నకిలీ ధ్రువపత్రాలను సృష్టించుకొని నివాసం ఉంటున్న నలుగురు బంగ్లాదేశీయులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు భద్రాద్రి జిల్లా కొత్తగూడెం త్రీటౌన్ ఇన్‌స్పెక్టర్ మురళి తెలిపారు. కొత్తగూడెం పట్టణంలో సఫాయి బస్తీలో ఓ ఇంటి నిర్మాణ పనులను చేస్తూ అనుమానాస్పదంగా కనిపించిన నలుగురు వ్యక్తులను త్రీ టౌన్ ఎస్ఐ విజయకుమారి అదుపులోకి తీసుకుని విచారించగా తాము బంగ్లాదేశ్‌కు చెందినవారమని, అక్రమంగా దేశంలోకి చొరబడినట్లు అంగీకరించారు. వారంతా నకిలీ ధ్రువపత్రాలు సృష్టించుకుని ఎవరికీ అనుమానం రాకుండా కొత్తగూడెంలో జీవిస్తున్నట్లు పోలీసులు నిర్ధారించారు. దాంతో వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పట్టుబడిన వారిలో మహమ్మద్ ఆజాద్ అలియాస్ షేక్ ఆజాద్, మొహమ్మద్ రాబిన్ మియా, మహమ్మద్ అలామిన్ హుస్సేన్, మహమ్మద్ మోహిన్ ఉన్నారు. వీరి నుంచి నకిలీ ధ్రువపత్రాలను, బ్యాంక్ పాస్‌బుక్, ఏటీఎం, మొబైల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఎవరైనా ఇతర దేశస్తులు చుట్టుపక్కల ప్రాంతాల్లో అనుమాస్పాదంగా కనిపిస్తే ప్రజలు పోలీసు వారికి సమాచారం అందించాలని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

హ్యూమన్ రైట్స్ పేరుతో తనిఖీల ముఠా సభ్యుల రిమాండ్

కామేపల్లి, ఫిబ్రవరి 20: హ్యూమన్ రైట్స్ పేరుతో ఓ ఐదుగురు ముఠాగా ఏర్పడి కామేపల్లి ఏజీహెచ్ఎస్ వసతి గృహం తనిఖీలు చేపట్టిన విషయం విధితమే. హాస్టల్ వార్డెన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మంగళవారం ముఠా సభ్యులైన జర్పుల స్రవంతి, భూక్య వెంకటేశ్వర్లు, మరికంటి శేఖర్, ఫరీద్, భూక్య రెడ్యాలపై న్యాయమూర్తి ఎదుట హాజరు పరిచినట్లు ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. కోర్టు వారికి రిమాండ్ విధించినట్లు పేర్కొన్నారు.

వదంతులు నమ్మొద్దు: ఎస్ షాకీర్

కల్లూరు, ఫిబ్రవరి 20: మండలంలో కిడ్నాపర్ల వదంతులు నమ్మవద్దని ఎస్ఐ ఎస్‌కె షాకీర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ మండల పరిధిలో గల పలు గ్రామాల్లో కిడ్నాపర్లు ప్రవేశించి పిల్లలను కిడ్నాప్ చేస్తున్నట్లు ఇటీవల కాలంలో కొంత మంది వ్యక్తులు సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేస్తున్నారని వాటిని నమ్మవద్దని కోరారు.

మట్టి దొంగతనం కేసులో నిందితులకు బెయిల్ నిరాకరణ

ఖమ్మం లీగల్, ఫిబ్రవరి 20: కూసుమంచి మండలం గోపాలరావుపేట సీతామరామచంద్రస్వామి ఆలయ భూములలో అక్రమంగా మట్టిని దొంగతనం చేసిన నిందితులకు జిల్లా కోర్టు బెయిల్ నిరాకరించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకా రం.. సీతారామచంద్రస్వామి ఆలయ భూములలో 2024 జనవరి 27న కొంత మంది గుర్తు తెలియని వ్యక్తులు అక్రమంగా మట్టిని దొంగతనంగా తరలించారు. కూసుమంచి మండలం, గోపాలరావుపేటకు చెందిన డీసీసీబీ డైరెక్టర్ ఇంటూరి శేఖర్‌రావు తో పాటు చిన్నా వెంకన్న, కొండా వెంకన్న, చింతలపాటి రామకృష్ణలు ఆలయ భూములలో మట్టిని అక్రమంగా తరలించారని ఆలయ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కూసుమంచి పోలీసులు నిందితులపై కేసు నమోదు చేసి, కోర్టులో ప్రవేశ పెట్టారు. కాగా ఖమ్మం ప్రత్యేక సంచార న్యాయ స్థానం వారికి 14 రోజులు రిమాండ్ విధించారు. బెయిల్ కోసం జిల్లా కోర్టులో దాఖలు చేసుకోగా, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జగ్జీవన్ కుమార్ వారికి బెయిల్ నిరాకరిస్తూ మంగళవారం తీర్పు వెల్లడించారు.

ప్రజలకు అందుబాటులో ఉండండి: మంత్రి తుమ్మల

అశ్వారావుపేట, ఫిబ్రవరి 20: కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ప్రజలకు అందుబాటులో ఉండి పార్టీ అభివృద్ధికి పాటుపడాలని వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. మంగళవారం మండలంలోని నారంవారిగూడెంలో అనారోగ్యంతో బాధపడుతున్న సీనియర్ నాయకులు బండి పుల్లారావును మంత్రి పరామర్శించారు. అనంతరం నియోజకవర్గంలో, మండలంలోని రాజకీయ పరిస్థితులు, ప్రభుత్వం అమలులోకి తెస్తున్న సంక్షేమ పథకాలు, సమస్యలు, వాటి పరిష్కారాలపై ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో టీఎస్ పామాయిల్ రైతుసంఘ అధ్యక్షులు ఆలపాటి ప్రసాద్, దొడ్డా ప్రసాద్, దమ్మపేట సొసైటీ అధ్యక్షులు ఎలిన రాఘవరావు, బండి భాస్కర్, కాసాని నాగ ప్రసాద్, నున్న రత్నాకర్, ఎర్ర వసంతం, ముళ్ళపూడి చలపతిరావు, వేములపల్లి రామకృష్ణ, రసూల్, రాములు పాల్గొన్నారు.

రైతులకు సాయంగా బ్యాంకులు : డీజీఎం

అశ్వారావుపేట రూరల్, ఫిబ్రవరి 20: రైతులకు బ్యాంకులు ఎల్లప్పుడూ సాయంగా ఉంటాయని యూనియన్ బ్యాంక్ డీజీఎం హనుమంతరెడ్డి అన్నారు. మంగళవారం అశ్వారావుపేటలో యూనియన్ బ్యాంకు ఆధ్వర్యంలో కెమిలాయిడ్స్ అతిథిగృహం వద్ద రైతులు, నర్సరీ నిర్వాహకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బ్యాంకుల ద్వారా అన్నదాతలకు ఇచ్చే రుణాలను మరింతగా పెంచాలని రైతులు కోరారు. కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ ప్రవీణ్, రైతు సంఘనాయకులు ఆలపాటి రాంమోహనరావు, సుంకవల్లి వీరభద్రరావు, కొక్కెరపాటి పుల్లయ్య ప్రకాశరావు, చెన్నకేశవరావు, కాసాని చంద్రమోహన్, ఫణీంద్ర, రవి తో పాటు పలువురు రైతులు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని వ్యక్తిపై దాడి

పెనుబల్లి, ఫిబ్రవరి 20: మతిస్థిమితం లేని వ్యక్తిపై దాడి చేసిన సంఘటన మంగళవారం వీఎంబంజర్‌లో చోటు చేసుకుంది. మండలంలోని ప్రధాన జాతీయ రహదారి వెంట తిరుగుతున్న ఓ వ్యక్తి పిల్లలను కిడ్నాప్ చేస్తున్నాడంటూ అనుమానించిన కొందరు అతడిని వెంబడించారు. వీఎంబంజర్‌లోని సత్తుపల్లి రోడ్డు నుంచి కొత్తగూడెం రోడ్డులో పరుగెత్తడంతో అతడిపై దాడిచేశారు. అతడిని సోదా చేయడంతో అనుమానించదగ్గ గుర్తులు లేకపోవడంతో అనంతరం పోలీసులకు అప్పగించారు. ఎస్ఐ వెంకటేష్ మాట్లాడుతూ కిడ్నాపర్లు ఎవరూ లేరని, ఎలాంటి సంఘటనలు నమోదు కావడం లేదని, భిక్షాటకులు, మతిస్థిమితం లేని వ్యక్తులపై దాడులకు దిగవద్దని, అనుమానితులు ఎవరైనా ఉంటే తమకు సమాచారం అందించాలని సూచించారు.

కేటీపీఎస్ కర్మాగారంలో చోరీ

● రూ. 50 వేల విలువైన కాపర్ పైపులు దొంగిలించిన దుండగులు

పాల్వంచ, ఫిబ్రవరి20: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ కేటీపీఎస్ ఓఅండ్ఎం కర్మాగారంలో కాపర్, ఇనుప పైపులు చోరీకి గురయ్యాయని కేటీపీఎస్ ఏఈ స్వాతి మంగళవారం పోలీసులుకు ఫిర్యాదు చేశారు. జెన్కో విజిలెన్స్ డీఎస్పీ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. కేటీపీఎస్ కర్మాగారంలో పైపులు చోరీకి గురయ్యాయన్న ఫిర్యాదు మేరకు పాల్వంచ పట్టణ పరిధిలోని మార్కెట్ ఏరియాలో గల ఓ పాత ఇనుప దుకాణంలో తనిఖీలు నిర్వహించగా 157 కాపర్ పైపులు, 5 ఇనుప పైపులు మొత్తం రూ. 50 వేల విలువైన సామాగ్రిని గుర్తించి కేటీపీఎస్‌కు తరలించారమన్నారు. కర్మాగారంలోని సీసీ పుటేజీలను పరిశీలించగా నలుగురు వ్యక్తులు అక్రమంగా కర్మాగారంలోకి ప్రవేశించి చోరీకి పాల్పడినట్లు గుర్తించామన్నారు. చోరీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ రమేష్ తెలిపారు.

లోక్ అదాలత్ పరిష్కారం కేసులో ..

● బాధితులకు రూ.1.75 కోట్ల పరిహార చెక్కు అందజేత

ఖమ్మంలీగల్, ఫిబ్రవరి 20: జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా పరిష్కారమైన కేసులో రూ.1.75కోట్ల పరిహార చెక్కును బాధిత కుటుంబ సభ్యులకు జిల్లా ప్రధాన న్యాయాధికారి బి.ఎస్.జగ్జీవన్‌కుమార్ మంగళవారం అందజేశారు. కొత్తగూడెం థర్మల్‌పవర్ స్టేషన్లో ఇంజనీరుగా పనిచేస్తున్న అభినందన స్రవంతి 2019లో జరిగిన ఒక రోడ్డుప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. ఈ విషయంలో సదరు బీమా కంపెనీపై నష్టపరిహారం కోరుతూ ఆమె కుటుంబ సభ్యులు ఖమ్మం న్యాయవాది మందడపు శ్రీనివాసరావు ద్వారా జిల్లా కోర్టులో కేసు దాఖలు చేశారు. జాతీయ లోక్‌అదాలత్ సందర్భంగా ఈ కేసును లోక్‌అదాలత్ ద్వారా పరిష్కరించడానికి ఇరుపక్షాలు వారు అంగీకరించారు. దీంతో మూడవ అదనపు జిల్లా న్యాయాధికారి కె.రామ్‌ప్రసాదరావు లోక్‌అదాలత్ అవార్డును, సదరు లోక్‌అదాలత్ అవార్డును అందుకున్నారు. దీంతో సదరు బీమా కంపెనీ నష్టపరిహార సొమ్మును మంగళవారం చెక్కు రూపంలో జిల్లా ప్రధాన న్యాయాధికారికి న్యాయవాది గంగాధర్ ద్వారా అందించారు. మృతురాలి వారసులు కోర్టులో సంబంధిత పిటీషన్ దాఖలుచేసుకోవటం ద్వారా ఈ డబ్బును విత్‌డ్రా చేసుకోనున్నారు.

ఐఏఎల్ 9వ జిల్లా మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

ఖమ్మం లీగల్, ఫిబ్రవరి20: ఖమ్మంలో ఫిబ్రవరి 24న జరిగే ఇండియన్ అసోషియేషన్ ఆఫ్ లాయర్స్(ఐఏఎల్) 9వ జిల్లా మహాసభ పోస్టర్‌ను ఐఏఎల్ సీనియర్ న్యాయవాదులు ఖమ్మం కోర్టు ఆవరణలో మంగళవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు పోట్ల మాధవరావు, పెమ్మసాని పట్టాభి, పారుపల్లి అమర్‌చంద్, షేక్ లతీఫ్, ఓరుగంటి శేషగిరిరావు, మేకల నవీన్‌కుమార్, జి.వి.లక్ష్మీనారాయణ, ఎం.డి.పర్వేజ్ తదితరులు పాల్గొన్నారు.



దరఖాస్తుదారులతో మాట్లాడుతున్నఎమ్మెల్యే

సీఎంఆర్ఎఫ్ అందరికీ అందించాలి...

» కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని

కొత్తగూడెం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): సీఎం రిలీఫ్ ఫండ్ దరఖాస్తుల స్వీకరణలో జరిగిన జాప్యంపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి ప్రతి లబ్ధిదారుడికి రిలీఫ్ ఫండ్ మంజూరు చేయాలని కొత్తగూడెం శాసనసభ్యుడు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు కోరారు. కొత్తగూడెంలో మంగళవారం పలువురి నుంచి ఆయన సీఎం రిలీఫ్‌ఫండ్ దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ రోగులు ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయిన తర్వాత ఆరు నెలలలోపు దరఖాస్తు చేసుకోవాలనే నిబంధన ఉందని, చాలా మంది సకాలంలో దరఖాస్తు చేసుకున్నప్పటికీ ఎన్నికల కోడ్ దృష్ట్యా స్వీకరణ నిలిచి పోవడంతో ఆరు నెలల గడువు ముగిసిపోయిందన్నారు. ఒక్క కొత్తగూడెం నియోజకవర్గ పరిధిలోనే సుమారు 500 మందికి పైగా లబ్ధిదారులు ఆరు నెలల నిబంధన మూలంగా నష్టపోయే పరిస్థితులు ఏర్పడ్డాయని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాదిమంది లబ్ధిదారులకు ఈ సమస్య ఏర్పడిందని, దీనిపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించాలని కోరారు.

ధర్మకర్తల నియామకానికి ప్రకటన

పాల్వంచ, ఫిబ్రవరి 20: పాల్వంచ మండలం జగన్నాథపురం గ్రామంలోని శ్రీకనకదుర్గ దేవస్థానం(పెద్దమ్మగుడి) ధర్మకర్తల మండలి నియామకానికి మంగళవారం దేవాదాయశాఖ అధికారులు ప్రకటన విడుదల చేశారు. ఆసక్తి గల అభ్యర్థులు ధర్మకర్తగా నియామకం కొరకు వారి వివరాలతో నిర్ణీత ఫార్మెట్‌లో పూరించి దరఖాస్తులను 20 రోజుల్లో కమిషనర్, ప్రాంతీయ కమిషనర్, ఉపకమిషనర్, సహాయ కమిషనర్ దేవాదాయ ధర్మాదాయ శాఖ ఖమ్మం వార్లకు పంపాలని ఆలయ కార్యనిర్వహణాధికారి రజనీకుమారి తెలిపారు.

జేవీఆర్ ఓసీలో పర్యటించిన రష్యన్ కంపెనీ సభ్యులు



ఉపరితల గనిలో గ్యాజ్‌ప్రోమ్ కంపెనీ సభ్యులు

సత్తుపల్లి, ఫిబ్రవరి20: కొత్తగూడెం ఏరియాలోని జేవీఆర్ ఓసీని రష్యన్ మల్టీనేషనల్ ఎనర్జీ కార్పొరేషన్ సంస్థ గ్యాజ్‌ప్రోమ్ కంపెనీ సభ్యులు మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఓపెన్ కాస్ట్ గనుల సందర్శించి ఓసీలలో ఉపయోగించే షావెల్స్, డంపర్స్ కు వినియోగించే ఇంధనం డీజిల్‌కు బదులు ప్రత్యామ్నాయంగా లిక్విఫైడ్ నాచురల్ గ్యాస్ (ఎల్ఎన్‌జీ)ని వినియోగించే అవకాశాన్ని అధ్యయనం చేశారు. వారివెంట జీఎం షాలెంరాజు ఉన్నారు.

» మన్యంలో కూంబింగ్ ఆపాలని డిమాండ్
» అరెస్టు చేసిన వారంతా చట్టబద్ధ కార్యకర్తలు
» వారిని భేషరుతా విడుదల చేయాలి
» ఎన్డీని నిషేధిత పార్టీగా ప్రకటించడంపై ఖండన
» న్యూడెమోక్రసీ రాష్ట్ర సహాయ కార్యదర్శి సాధినేని వెంకటేశ్వరరావు



మాట్లాడుతున్న ఎన్డీ రాష్ట్ర సహాయకార్యదర్శి సాధినేని వెంకటేశ్వరరావు

పూసపల్లి కుట్ర కేసును..
ఎత్తివేయాలి

ఇల్లెందుటౌన్, ఫిబ్రవరి 20: న్యూడెమోక్రసీ నాయకులపై అక్రమంగా మోపిన పూసపల్లి కేసును తక్షణం ఎత్తివేయాలని, ఏజెన్సీ గ్రామాల్లో పోలీసుల కూంబింగ్ నిలిపివేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర సహాయకార్యదర్శి సాధినేని వెంకటేశ్వరావు, ఈస్ట్ రాష్ట్ర కమిటీ ప్రధాన కార్యదర్శి ఎం. శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం ఇల్లెందులోని పెన్షనర్ల భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.

న్యూడెమోక్రసీ రాష్ట్రకార్యదర్శి అశోక్‌ను ఈ నెల14న ఖమ్మం సమీపంలోని రఘునాథపాలెం మండలం, కోయచెలక గ్రామం వద్ద పోలీసులు మాటు వేసి పట్టుకున్నారని వివరించారు. అశోక్ అనారోగ్యంతో ఇబ్బంది పడుతూ, ఖమ్మంలో వైద్యం చేయించుకుని తిరిగి వెళుతుండగా పట్టుకున్నారని.. ఇదే వాస్తవమని తెలిపారు. పూసపల్లి దగ్గర సాయుధదళం ఉందనే సమాచారంతో, దాడి చేసి నలుగురిని పట్టుకున్నామని, మిగగా సభ్యులు తప్పించుకున్నారని పోలీసులు ప్రకటించడం హాస్యాస్పదం అన్నారు. న్యూడెమోక్రసీని నిషేధిత పార్టీగా పోలీసులు ప్రకటించడాన్ని తీవ్రంగా ఖండించారు. న్యూడెమోక్రసీ ఖమ్మం, వరంగల్ జిల్లాతో పాటు ఇతర ప్రాంతాల్లో పార్టీ బలంగా ఉందన్నారు. ఆయుధ, ఆత్మరక్షణ దళాలు కలిగి భూస్వాములకు, వారిగుండాలకు, పెత్తందారులకు పోలీసుల ఆకృత్యాలకు వ్యతిరేకంగా ప్రతిఘటన పోరాటం చేస్తున్నామని ప్రకటించారు. రాష్ట్ర అభివృద్ధిలో న్యూడెమోక్రసీ సలహాలు సూచనలు తీసుకుంటామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారని గుర్తు చేశారు.

ఇల్లెందు నియోజకవర్గంలో ఆరుపర్యాయలు శాసనసభ స్థానం గెలిచి అనేక మంది సర్పంచ్‌లు, జడ్పీటీసీ సభ్యులు, వార్డు సభ్యులతో ఎంతో అభివృద్ధి చేశామన్నారు. పోలీసులు అరెస్టు చేసిన కార్యకర్తలు చట్టబద్ధంగానే పనిచేస్తున్నారని, వారిని భేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రైతు కూలీసంఘం రాష్ట్ర అధ్యక్షుడు మామిడాల భిక్షపతి, ఎన్డీ నాయకులు సీతరామయ్య, రాసుద్దీన్, విశ్వనాథం, రామ్‌సింగ్, తదితరులు పాల్గొన్నారు.

ఈపీఎస్-95 పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

» ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు



మాట్లాడుతున్న కృష్ణారావు

ఖమ్మం సంక్షేమవిభాగం, ఫిబ్రవరి 20: ప్రభుత్వం కల్పించే ఆసరా పింఛన్ల కంటే తక్కువగా పదవీ విరమణ పొందిన ఈపీఎస్-95 ఉద్యోగులు నెలకు రూ.1,000 పెన్షన్ పొందుతున్నారని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు పి. కృష్ణమూర్తి, రంగయ్య, మల్లికార్జునరావు ఆందోళన వ్యక్తంచేశారు. మంగళవారం మంచికంటి భవన్‌లో సంఘం జిల్లా అధ్యక్షుడు పాటిబండ్ల కృష్ణారావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కళ్యాణం నాగేశ్వరరావు నివేదికను ప్రవేశ పెట్టగా, నాయకులు మధవరావు, ఝాన్సీ, రాములమ్మ, నాగేశ్వరరావు, జరీనా, ముధ, గణపతి, కుటుంబరావు, శ్రీధర్, మీరాఖాన్, సాంబయ్య పాల్గొన్నారు.



జడ్పీ చైర్మన్‌ను కలిసిన ఎంపీడీవోలు

పీఆర్ పనులు సకాలంలో పూర్తిచేయాలి

» ఎంపీడీవోలతో జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్

ఖమ్మం కలెక్టరేట్, ఫిబ్రవరి 20: గ్రామాల్లో పంచాయతీరాజ్ పనులు పెండింగ్ లేకుండా చూడాలని, సకాలంలో పూర్తి చేయాలని జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ కోరారు. మంగళవారం ఆయన చాంబర్‌లో ఇతర జిల్లాల నుంచి ఖమ్మం జిల్లాకు బదిలీపై వచ్చిన మండల పరిషత్ అభివృద్ధి అధికారులు (ఎంపీడీవో)లతో సమీ క్షించారు. గ్రామాల్లో ప్రత్యేక అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయించాలన్నారు. ఎక్కడా పనులు పెండింగ్‌లో లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లా పరిషత్ ద్వారా చేపట్టిన నిధులతో నిర్వహిస్తున్న పనులను కూడా ఎప్పటిక ప్పుడు పర్యవేక్షిస్తు పూర్తి చేయించాలన్నారు. అంకితభావంతో పనిచేసి గ్రామీణ ప్రాంత ప్రజలకు విస్తృత సేవలు అందించాలన్నారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా పరిషత్ సీఈవో వినోద్, వివిధ మండలాల ఎంపీడీవోలు పాల్గొన్నారు.

9 నెలల శిక్షణకు స్టైఫండరీ కానిస్టేబుళ్లు

ఖమ్మం క్రైం, ఫిబ్రవరి 20: తెలంగాణ పోలీసు నియామక మండలి ద్వారా ఎంపికైన 158 మంది సివిల్, ఏఆర్ స్టైఫండరీ ట్రైనీ కానిస్టేబుళ్లు 9 నెలల శిక్షణ కోసం పోలీసు శిక్షణ కేంద్రాలకు వెళ్తున్నారు. వీరికి నగరంలోని పోలీసుహెడ్‌క్వార్టర్స్‌లో పోలీసు కమిషనర్ సునిల్‌దత్ పోలీసు ఐడెంటిఫికేషన్ కార్డు, కిట్ ఆర్టికల్స్‌ను అందించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ 9నెలల శిక్షణ కాలాన్ని చక్కని అవకాశంగా భావించాలని, ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా నేర్చుకోవడంపై దృష్టిపెట్టాలన్నారు. ఖమ్మం కమిషనరేట్ నుంచి 54మంది సివిల్ ట్రైనీ కానిస్టేబుళ్లు, 55మంది ఆర్మడ్ రిజర్వు కానిస్టేబుళ్లు ఉన్నారన్నారు. వీరిలో 33మంది మహిళ సివిల్ కానిస్టేబుళ్లు, 16మంది మహిళ ఆర్మడ్ రిజర్వు ట్రైనీ కానిస్టేబుళ్లు ఉన్నారన్నారు. వీరందరికీ రాష్ట్ర పోలీసు అకాడమితోపాటు పీటీసీ వరంగల్, సీటీసీ సైబరాబాద్, 8వబెటాలియన్‌లో శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీసీఆర్బీ ఏసీపీ గణేష్, ఏవో అక్తరున్నీసా బేగం, ఆర్ఐలు కామరాజు, శ్రీశైలం, అప్పలనాయుడు, సీఐలు అంజలి, స్వామి, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

శారీరకంగా మానసికంగా దృఢంగా ఉండాలి

కొత్తగూడెం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ స్టేట్ లెవల్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ద్వారా కానిస్టేబుల్ ఉద్యోగాల కు ఎంపికైన 75 మంది కి మంగళవారం 9 నెలల ప్రాథమిక శిక్షణ నిమిత్తం ట్రైనింగ్ సెంటర్లకు పంపినట్టు ఎస్పీ రోహిత్ రాజు తెలిపారు. ఇందులో సివిల్ కానిస్టేబుల్ పురుషులు 27మందిని సైబరాబాద్ ట్రైనింగ్ సెంటర్‌కు, సివిల్ మహిళలు 18మందిని పీటీసీ వరంగల్‌కు, ఆర్మడ్ రిజర్వ్ కానిస్టేబుల్స్ పురుషులు 22 మందిని మొదటి బెటాలియన్ యూసుఫ్‌గూడకు, ఏఆర్ మహిళలు 8మందిని టీఎస్‌పీఏ ట్రైనింగ్ సెంటర్లకు పంపామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ ఎస్పీ విజయ్ బాబు, అడ్మిన్ ఆర్ఐ రవి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



స్టైఫండరీ కానిస్టేబుళ్లకు కిట్ ఆర్టికల్స్ అందిస్తున్న సీపీ సునిల్‌దత్

రెండు నెలల్లో సైన్స్ మ్యూజియం

ఖమ్మం ఖమ్మం ఖానాపురంహవేలి, ఫిబ్రవరి 20: జిల్లా కేంద్రంలో సైన్స్ మ్యూజియం రెండు నెలల్లో ప్రారంభం అవుతుందని, నిధులు సమకూరాయని డీఈవో సోమశేఖర శర్మ అన్నారు. మంగళవారం ఖమ్మం సైన్స్ మ్యూజియం ప్రాంగణంలో ఎఫ్ఎస్‌టీ, టీబీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి సైన్స్ టాలెంట్ టెస్ట్ విజేతల బహుమతి ప్రదానోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పదో తరగతిలో ఉత్తమ ఫలితాల సాధనకు సబ్జెక్టు ఫోరం టీచర్స్ ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని అన్నారు. వచ్చే సంవత్సరం అన్ని సబ్జెక్టుల ఆధ్వర్యంలో ఒకే టాలెంట్ టెస్ట్ నిర్వహించేందుకు కృషి చేయాలని ఆయన సూచించారు. సైన్స్ టాలెంట్ టెస్ట్ జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతిని నేలకొండపల్లి సోషల్ వెల్ఫేర్ గురుకులం విద్యార్థిని జి. గిరిశిత, ద్వితీయ బహుమతిని జల్లెపల్లి హైస్కూల్ విద్యార్థి మనీష్ కుమార్ తృతీయ బహుమతి వేంసూర్ బాల మణికంఠ నేలకొండపల్లి శివానంద్ కైవసం చేసుకోగా, వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీబీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రేపాల శ్రీనివాసరావు ,ఏఎంవో కె. రవికుమార్, డీసీఈబీ కార్యదర్శి నారాయణరావు, టీబీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పెసర ప్రభాకర్ రెడ్డి, డీఎస్వో జగదీశ్వర్, పంజాల ఐలయ్య, రచ్చ శ్రీనివాస్ ఆదిత్య, ఇనుముల వెంకటేశ్వర్లు, డాన్ బాస్కో, రంజిత్, చంద్రశేఖర్, శ్రీనివాస్, రంగనాథ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఈవో

పదిలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి

డీఈవో సోమశేఖర శర్మ



అంబేద్కర్ నగర్‌లో పరిరాలు పరిశీలిస్తున్న అధికారులు

కాలుష్య నియంత్రణ అధికారుల తనిఖీ

సత్తుపల్లిరూరల్, ఫిబ్రవరి20: తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ అధికారులు మంగళవారం సింగరేణి ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. సత్తుపల్లిలోని జలగం వెంగళరావు నగర్, కిష్టారం సైలో బంకర్ ప్రాంతాలలో కాలుష్య తీవ్రతను పరికరాలతో పరీక్షించి నమోదు చేసుకున్నారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు వస్తున్నారనే సమాచారం తెలుసుకున్న సింగరేణి అధికారులు గ్రామంలో రక్షణ చర్యలు చేపట్టారు. సీహెచ్‌పీ వద్ద రైళ్లలో బొగ్గును రేకులలో నింపే ప్రక్రియను నిలిపివేశారని, సత్తుపల్లి-కిష్టారం మధ్యలో రహదారిపై ట్యాంకర్లతో వాటరింగ్ చేయించారని అంబేద్కర్ నగర్ వాసులు విమర్శించారు. ఎప్పుడూ లేనివిధంగా రహదారులపై నీళ్ల చల్లుతూ, గ్రామంలో కాలుష్యం లేదనుకునేలా అధికారులు ప్రవర్తించడాన్ని గ్రామస్థులు తప్పుబట్టారు. తొలుత అధికారులను కిష్టారం గ్రామస్థులు అడ్డుకున్నారు. కాలుష్యాన్ని కలిగించే చర్యలను సింగరేణి అధికారులు ముందుగానే నిలిపేశారని, ఇప్పుడు తనిఖీలు చేస్తే ప్రమాద తీవ్రత తక్కువగా నమోదవుతుందని అన్నారు. సింగరేణి సంస్థపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



రహదారిపై నీళ్లు జల్లుతున్న ట్యాంకర్

ఉద్యోగంతో పాటు ఉద్యమాలూ...

» టీజీవో రాష్ట్ర అధ్యక్షుడిగా ఏలూరి శ్రీనివాసరావు ఏకగ్రీవ ఎన్నిక
» సొంత జిల్లా ఖమ్మంలో హర్షాతిరేకాలు
» తెలంగాణ ఉద్యమంలో తనదైన ముద్ర
» ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా నియామకం అయ్యే చాన్సు

ఖమ్మం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఖమ్మం జిల్లాకు చెందిన ఏలూరి శ్రీనివాసరావు తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

రాష్ట్ర సాధన ఉద్యమంలో టీజీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, అధ్యక్షుడిగా మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ వ్యవహరించిన సమయంలో పలు ఆందోళనల్లో శ్రీనివాసరావు కూడా కీలక పాత్ర పోషించారు. రాష్ట్ర నేతగా ఖమ్మం జిల్లాలో కూడా తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమానికి ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులతో సమిష్టి సమావేశాలు, ఆందోళనలు, ధర్నాలు, సహాయ నిరాకరణ ఉద్యమాలు నడిపించారు. రాష్ట్ర విభజన సమయంలో భద్రాచలం రామాలయాన్ని ఏపీలో కలిపే ప్రయత్నాలు జరుగుతున్నప్పుడు భద్రాద్రి రాముడు తెలంగాణ దేవుడు అనే నినాదంతో ఖమ్మంలో ఆమరణదీక్ష చేపట్టి ఢిల్లీ స్థాయిలో భద్రాచలాన్ని తెలంగాణలో ఉంచేలా తన ఆమరణ దీక్ష ద్వారా కదిలించారు.

రాష్ట్ర విభజన తర్వాత శ్రీనివాస్‌గౌడ్ ఎమ్మెల్యేగా గెలిచి మంత్రి అయినప్పుడు రాష్ట్ర అధ్యక్షుడుగా ఏలూరి శ్రీనివాసరావు పగ్గాలు చేపట్టాల్సి ఉన్నప్పటికి శ్రీనివాస్‌గౌడ్ మమతను అధ్యక్షురాలిగా చేశారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా శ్రీనివాస్‌గౌడ్ వ్యవహరించారు.

ఏలూరి శ్రీనివాసరావును రాష్ట్ర యూనియన్‌కు దూరం చేయడం తోపాటు ఆయనపై తన పరపతిని ఉపయోగించి ఉద్యోగ నిర్వహణలో పోస్టింగ్‌లు ఇవ్వకుండా, పదోన్నతులు రాకుండా వరుస బదిలీలు చేయించడం, నోటీసులు ఇప్పించడం వంటి వేధింపులకు దిగినట్టు ఆరోపణలున్నాయి.

ఖమ్మంకు చెందిన ఏలూరి శ్రీనివాసరావు 1993లో అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్‌గా ఉద్యోగంలో చేరారు. తర్వాత ఎక్సైజ్ ఎస్ఐగా, గ్రూప్-1 ద్వారా ఎంపీడీవోగా ఉద్యోగం పొందారు. ఖమ్మం ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా ఉంటూ వరంగల్ జిల్లాకు ఎంపీడీవోగా బదిలీ అయ్యారు. మళ్లీ ఆయన ఖమ్మం ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా రాబోతున్నారు. గత ప్రభుత్వంలో తాను ఎదుర్కొన్న పలు వేధింపులకు సంబంధించి 48 పిటిషన్లు వేసి న్యాయపోరాటం సాగిస్తున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత టీజీవో సంఘాన్ని తన ఆధీనంలోకి తీసుకుని గడిచిన రెండునెలలుగా రాష్ట్రమంతా పర్యటించి పట్టు సాధించారు. శ్రీనివాసరావు టీజీవో అధ్యక్షుడిగా ఎన్నిక కావడం పట్ల ఉద్యోగవర్గాల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.



ఉద్యమ సమయంలో భద్రాచలం రాముడిని తెలంగాణలో ఉంచాలని ఖమ్మంలో ఆమరణదీక్ష చేసిన ఏలూరి



చైర్మన్ రావూరి సైదబాబును అభినందిస్తున్న వైస్ చైర్మన్ రావెళ్ల శ్రీనివాసరావు, డీసీవో మురళీధర్‌రావు

వీవీ పాలెం సొసైటీ
కాంగ్రెస్ కైవసం

చైర్మన్‌గా రావూరి సైదబాబు ఏకగ్రీవ ఎన్నిక

రఘునాథపాలెం, ఫిబ్రవరి 20: రఘునాథపాలెం మండలంలోని వి.వెంకటాయపాలెం సొసైటీలో నెలరోజులుగా సాగుతున్న నాటకీయ పరిణామాలకు ఎట్టకేలకు శుభం కార్డు పడింది. గతంలో ఈ సొసైటీకి ఏకగ్రీవంగా చైర్మన్‌గా ఎన్నికైన బీఆర్ఎస్‌కు చెందిన కూరాకుల నాగభూషయ్య ఇటీవల అవిశ్వాసం ఎదుర్కొని సొసైటీ చైర్మన్ పదవితో పాటు డీసీసీబీ చైర్మన్ పదవి కూడా కోల్పోయిన విషయం విదితమే. తాజాగా ఆయన స్థానంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన రావూరి సైదబాబును సొసైటీ పాలకవర్గం ఏకగ్రీవంగా ఎన్నుకుంది. జిల్లా సహకార అధికారి వంకాయలపాటి మురళీధర్‌రావు ఆధ్వర్యంలో మంగళవారం రఘునాథపాలెం వి.వెంకటాయపాలెం సొసైటీ కార్యాలయంలో చైర్మన్ ఎన్నిక కోసం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. మొత్తం 13మంది సొసైటీ డైరెక్టర్లకుగాను 10 మంది డైరెక్టర్లు హాజరయ్యారు. కోరమ్ మేరకు సభ్యులు హాజరుకావటంతో ఇన్‌చార్జ్ చైర్మన్‌గా ఉన్న రావెళ్ల శ్రీనివాసరావు సూచనల మేరకు డీసీవో మురళీధర్‌రావు ఎన్నిక ప్రక్రియ చేపట్టారు.

వైస్ చైర్మన్ రావెళ్ల శ్రీనివాసరావు, డైరెక్టర్లు రావూరి సైదబాబు, గుండే ఆదినారాయణ, మెర్రిమేకల నాగేశ్వరరావు, జోగు అనిత, గోడ్ల సుగుణ, బాణోత్ వెంకన్న, గోపగాని ముత్తిలింగం, బాణోత్ రామారావు, తేజావత్ బావ్‌సింగ్ సమావేశంలో పాల్గొనగా, రావూరి సైదబాబును చైర్మన్‌గా నియామకం చేయాలని వైస్ చైర్మన్ రావెళ్ల శ్రీనివాసరావు, డైరెక్టర్ జోగు అనిత ప్రతిపాదించి లేఖను డీసీవోకు అందించారు. ఈ ప్రతిపాదనను మిగతా సభ్యులు అంగీకరించటంతో సొసైటీ చైర్మన్‌గా రావూరి సైదబాబును ఏకగ్రీవంగా ఎన్నిక చేశారు. వైస్ చైర్మన్‌గా రావెళ్లి శ్రీనివాసరావును కొనసాగిస్తూ పాలకవర్గం ఆమోదం తెలుపుతూ ఓటింగ్‌లో పాల్గొన్నారు.

గొర్రెల పంపిణీలో ఇష్టారాజ్యం

» అంబులెన్సు వాహనాల నెంబర్లనూ వాడుకున్నారు..
» ఒకే సంఖ్యపై 20 ఇన్వాయిస్‌లతో 78 యూనిట్ల రవాణా
» 'కాగ్' నివేదికలో బట్టబయలైన అక్రమాలు
» బాధ్యులైన 27 మందికి షోకాజ్ నోటీసులు

ఖమ్మం వ్యవసాయం, ఫిబ్రవరి 20: రాష్ట్ర వ్యాప్తంగా గొర్రెల పంపిణీలో జరిగిన అవతవకల్లో ఖమ్మం జిల్లాలో కూడా భాగస్వామ్యం ఉన్నట్లు కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) తన నివేదికలో పేర్కొంది. ఏకంగా రోగులను తరలించే అంబులెన్స్‌లో గొర్రెలను తరలించినట్లు సంబంధిత అధికారులు రికార్డుల్లో నమోదు చేసినట్లు తెలిపింది. నోటికి వచ్చిన నెంబర్‌తో వాహనాన్ని నమోదు చేయడంతో అది అంబులెన్స్ అని కూడా పట్టించుకోకుండా గొర్రెల తరలింపునకు ఉపయోగించినట్లు రికార్డుల్లో నమోదు చేశారని కాగ్ తప్పుబట్టింది. ఈ నేపథ్యంలో ఖమ్మం జిల్లాలో మొదటి విడత గొర్రెల పంపకంలో జరిగిన అక్రమాల నేపథ్యంలో 27మంది పశు వైద్యులు, ఇతర అధికారులపై చర్యలకు అధికారులు షోకాజ్ నోటీసులు జారీచేశారు.

2017-18 సంవత్సరంలో జిల్లాలో 970 యూనిట్ల గొర్రెలను పంపిణీ చేశారు. ఒక్కో యూనిట్ ఖరీదు రూ.1.75 లక్షలు.. కాగా వీటి మొత్తం విలువ రూ.17కోట్లు. గొర్రెలను అప్పట్లో ఏపీలోని ప్రకాశం, కడప, విశాఖపట్నం జిల్లాల నుంచి కొనుగోలు చేశారు. గొర్రెల కొనుగోలుకు సంబంధించి జిల్లా నుంచి మొత్తం సుమారు 27మంది పశు వైద్యులు, ఇతర అధికారులకు ప్రభుత్వం బాధ్యతలు అప్పగించింది. కాగ్ నివేదికలో జిల్లాలో అక్రమాలకు సంబంధించి విషయాలు వెలుగుచూశాయి. గొర్రెల రవాణాకు సంబంధించి రోగులను ఆసుపత్రికి చేర్చే అంబులెన్స్‌లో వీటిని తరలించినట్లు అధికారులు గుర్తించారు.

కాగ్ నివేదికలో పేర్కొన్న అంశాలివే..

● ఖమ్మం జిల్లాలో నాలుగు యూనిట్లు (84 గొర్రెలు) ఏపీ-16: డబ్ల్యూ7585 నంబరు వాహనంలో తరలించినట్లు నమోదు చేశారు. ఈ నెంబరు ఒక అంబులెన్సుగా నమోదైంది.

● ఒకే సంఖ్య మీద ఉన్న 20 ఇన్‌వాయిస్‌లపై (78యూనిట్ల గొర్రెల రవాణాకు) రాయితీ కింద రూ0.66 లక్షలు, గొర్రెల మీద రూ.64.94 లక్షలు చెల్లించినట్లు తేలింది.

● 37 యూనిట్లకు పంపిణీలో పెన్నుతో అంకెలు మార్చి ఇన్వాయిస్ సంఖ్య 10 ఉంటే, దానిని 10,327 అని, 10,328 అని మార్చి అక్రమాలకు పాల్పడినట్లు కాగ్ నివేదిక పేర్కొంది.

● 69 ఉదంతాల్లో ఇన్‌వాయిస్ సంఖ్యలను పెన్నుతో మార్చి రవాణా ఛార్జీల కింద రూ.12.57 లక్షల రాయితీ, గొర్రెల మీద రూ.4.22 కోట్ల నిధులు దారి మళ్లించినట్లు తేల్చారు.

● జిల్లాలో క్రమ సంఖ్యలేవీ లేని ఇన్‌వాయిస్‌లతో రవాణా ఖర్చుల కింద రూ.11.25 లక్షలు, గొర్రెల మీద రూ.4.58 కోట్ల నిధుల దుర్వినియోగం జరిగిందని గుర్తించారు. నకిలీ ఇన్వాయిస్‌లతో రవాణా చేయకుండానే చేసినట్టు చూపారని కాగ్ పేర్కొంది.

ఎలాంటి అక్రమాలు జరగలేదు

డాక్టర్ బి.వేణుమనోహర్‌రావు, జిల్లా పశు సంవర్ధకశాఖ సంయుక్త సంచాలకుడు

గొర్రెల పంపిణీలో ఎలాంటి అక్రమాలు జరుగలేదు. ఆన్‌లైన్‌లో వాహనాలను తరలించిన నెంబర్‌ను తప్పుగా నమోదు చేయడం వల్లే కాగ్ అనుమానించింది. తప్పుగా నెంబర్ నమోదైన విషయాన్ని ప్రభుత్వానికి నివేదించాం. కాగ్ నివేదిక నేపథ్యంలో అక్రమాల ఆరోపణలు వచ్చిన 27మందికి షోకాజ్ నోటీసు ఇచ్చాం. పూర్తిస్థాయిలో విచారణ నిర్వహిస్తాం. తప్పు జరిగిందని తేలితే సొమ్ము రికవరీతో చట్టప్రకారం శిక్షిస్తాం.

భద్రాద్రిలో మళ్లీ ఎల్‌టీఆర్ కలకలం

● 10 మందికి నోటీసుల జారీకి రంగం సిద్ధం!

భద్రాచలం, ఫిబ్రవరి 20: ఏజెన్సీ డివిజన్ కేంద్రమైన భద్రాచలంలో మళ్లీ ఎల్‌టీఆర్(లాండ్ ట్రాన్స్‌ఫర్ రెగ్యులేషన్ యాక్టు) కలకలం నెలకొంది. ఇటీవల కొద్ది కాలంగా బహుళ అంతస్థుల నిర్మాణాలు విచ్చలవిడిగా చేపడుతుండటం, కొంత మంది పరిధి దాటి నిర్మాణాలు చేపడుతుండటంతో వారిపై రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకునేందుకు రంగం సిద్ధం చేసినట్లు సమాచారం. కలెక్టర్ ఆదేశాల మేరకు ఇప్పటికే రెవెన్యూ సిబ్బంది క్షేత్ర స్థాయిలో పర్యటించి బహుళ అంతస్తు నిర్మాణదారుల వివరాలను సేకరించారు. ఈ క్రమంలో ఇందుకు సంబంధించిన నివేదికను సిద్ధం చేసి భద్రాచలం ఆర్డీవోకి అందజేసినట్లు తెలుస్తోంది. నేపథ్యంలో పది మందికి తొలి విడతగా నోటీసులు ఈ వారంలోపు అందజేయనున్నట్లు తెలిసింది. కాగా మరికొంత మందికి సైతం రెండో విడతలో నోటీసులు జారీ చేసే అవకాశం ఉన్నట్లు రెవెన్యూ వర్గాలలో ప్రచారం సాగుతోంది,

'మానుకోట కాంగ్రెస్ ఎంపీ టికెట్ బెల్లయ్యనాయక్‌కు ఇవ్వాలి'

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, ఫిబ్రవరి20: మహబూబాబాద్ కాంగ్రెస్ పార్లమెంట్ టికెట్‌ను కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, తెలంగాణ ఉద్యమ కారుడు డాక్టర్ బెల్లయ్యనాయక్‌కు ఇవ్వాలని ఎల్‌హెచ్‌పీఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు బాణోత్ రమేష్ నాయక్ కోరారు. మంగళవారం స్థానిక బస్టాండ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన ఆ సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బెల్లయ్యనాయక్‌కు టికెటిస్తే కాంగ్రెస్ పార్టీ గిరిజనులకు న్యాయం చేసినట్లు అవుతుందని అన్నారు. ఈ సమావేశంలో న్యాయవాదులు లావుడ్యా రమేష్‌నాయక్, బాలాజీనాయక్, ఎల్ఎస్‌వో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంగీలాల్‌నాయక్, మోహన్‌నాయక్ పాల్గొన్నారు.

గుండెపుడి మాజీ సర్పంచ్ నరసింహా హఠాన్మరణం

జూలూరుపాడు, ఫిబ్రవరి 20: మండలంలోని రాంచంద్రాపురం గ్రామానికి చెందిన గుండెపుడి పంచాయతీ మాజీ సర్పంచ్ ఈసం నరసింహా (75) గుండెపోటుతో మంగళవారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఆయన మృతదేహాన్ని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్ర నరేంద్రకుమార్, పార్టీ మండల కార్యదర్శి గుండెపిన్ని వెంకటేశ్వర్లు సందర్శించి పార్టీ జెండాను కప్పి పూలమాల వేసి నివాళ్ళు అర్పించారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ నాగుల్‌మీరా, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి చింతా స్వరాజ్‌రావు, నాయకులు షేక్ చాంద్‌పాషా, వల్లమల్ల సామేలు, పొన్నెకంటి వెంకటేశ్వర్లు, తూము కోటయ్య, బి.రాములు పాల్గొన్నారు.

'పది' పరీక్షా కేంద్రాన్ని పునరుద్దరించాలి

దుమ్ముగూడెం ఫిబ్రవరి 20: దుమ్ముగూడెం జడ్పీ ఉన్నతపాఠశాల పదోతరగతి పరీక్షా కేంద్రాన్ని పునరుద్ధరించాలని కోరుతూ ఎస్ఎంసీ, గ్రామస్థులు మంగళవారం హెచ్ఎం రామారావుకు వినతిపత్రం అందజేశారు. నలభై ఏళ్లుగా ఉన్న పరీక్షా కేంద్రాన్ని గత ఏడాది అకారణంగా రద్దు చేశారని పేర్కొన్నారు. దుమ్ముగూడెం పది పరీక్షా కేంద్రాన్ని వెంటనే పునరుద్దరించాలని కోరారు. ఎస్ఎంసీ సభ్యులు ముసలి రాంబాబు, హుస్సేన్ అహ్మద్, సరిత, సత్యనారాయణ గ్రామస్థులు కొత్తూరి శీతారామారావు, బైరెడ్డి సతీష్, నగేష్‌కన్నా, నర్సింహారావు, ఆదిలక్ష్మి, ముత్యాలమ్మ పాల్గొన్నారు.

మన్యంలో.. మహిమగల తల్లులు

» నేటినుంచి బొజ్జాయిగూడెం, సంజయ్‌నగర్‌లో మినీ మేడారం జాతర



బొజ్జాయిగూడెం సమ్మక్క-సారలమ్మ గద్దెలు

ఇల్లెందురూరల్/ మణుగూరుటౌన్ ఫిబ్రవరి20: ఇల్లెందు మండలం బొజ్జాయిగూడెం, సంజయ్‌నగర్ గ్రామాల్లో వనదేవతలైన సమ్మక్క-సారలమ్మ జాతరకు అధికారులు, ఆలయ కమిటీ భారీ ఏర్పాట్లు చేసింది. నాలుగు దశాబ్దలుగా బాలాజీనగర్ గ్రామపంచాయతీ సంజయ్‌నగర్ గ్రామంలో, బొజ్జాయిగూడెం గ్రామపంచాయతీ బొజ్జాయిగూడెం చీకటి గండ్ల అటవీ ప్రాంతంలో వేర్వేరుగా సమ్మక్క-సారలమ్మ జాతరను నిర్వహిస్తున్నారు. సంప్రదాయ క్రతువుకు సింగరేణి సంస్థ సహకరిస్తుందని సంజయ్‌నగర్ ఆలయ కమిటీ ఛైర్మన్ డెరంగుల పోషం తెలిపారు. బొజ్జాయిగూడెంలో మినీ మేడారం జాతరను భారీ ఏర్పాట్లు చేసినట్లు బొజ్జాయిగూడెం కమిటీ ఛైర్మన్ కొర్సా కోటయ్య, మాజీ సర్పంచ్ చీమల వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం నుంచి అమ్మవార్లకు బోనాలతో జాతర ప్రారంభమవుతుందని వారు వివరించారు.

మదినిండుగా 'మండె మెలుగుట'

మణుగూరుటౌన్: మణుగూరు మండలంలోని తొగ్గూడెం గ్రామంలో సమ్మక్క-సారాలమ్మల దేవాలయంలో మండె మెలుగుట కార్యక్రమాన్ని మంగళవారం రాత్రి నిర్వహించారు. ఆలయ పూజారమ్మ పర్శిక రాజమ్మ, ఆలయ కమిటీ ఛైర్మన్ ఊకే వీరయ్య, కమిటీ సభ్యులు, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ప్రారంభ వేడుకలను నిర్వహించారు. భక్తులభద్రత చర్యలపై సీఐ సతీష్‌కుమార్, సింగరేణి సెక్యూరిటీ అధికారి షబ్బీరుద్దీన్ కమిటీ సభ్యులతో చర్చించారు.



పగిడిద్దరాజుకు స్వాగతం పలికిన మేడారం ట్రస్ట్ ఛైర్మన్ లచ్చుపటేల్

పగిడిద్దరాజుకు పస్రా వద్ద ఘనస్వాగతం

గుండాల: మేడారం సమ్మక్క భర్త, అరెం వంశీయుల ఇలవేల్పు అయిన పగిడిద్దరాజుకు ములుగు జిల్లా పస్రా వద్ద మేడారం ట్రస్ట్ ఛైర్మన్ లచ్చుపటేల్ ఘనంగా స్వాగతం పలికారు. నేటి నుంచి జరుగనున్న మేడారం సమ్మక్క సారలమ్మ జాతరకు సోమవారం గుండాల మండలం యాపలగడ్డ నుంచి పగిడిద్దరాజును కాలినడకన తీసుకువెళ్లారు. 70కి.మీ. ప్రయాణంలో దారి వెంట గ్రామాల్లో భక్తులు నీరాజనం పలికి భక్తి పారవశ్యంగా నృత్యాలు చేశారు. బుధవారం సాయంత్రానికి మేడారం చేరుకోనున్నట్లు అరెం వంశీయులు తెలిపారు.

ఐక్యతా మహాసభలను జయప్రదం చేయండి

సుజాతనగర్, ఫిబ్రవరి 20: సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ ఐక్యతా మహాసభలను జయప్రదం చేయాలని ప్రజాపంథా మండల కార్యదర్శి బానోత్ ధర్మా పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలో ఆ పార్టీ ఆలిండియా మహాసభలను ఆవిష్కరించారు. మార్చి 3,4,5 తేదీలలో జరిగే భారీ బహిరంగ సభను ఖమ్మంలో ఏర్పాటు చేశారని, కూలీలు, రైతులు, మేధావులు, అత్యధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలునిచ్చారు.

కరకగూడెంలో ఆర్టీసీ బస్టాండ్ నిర్మించాలి

కరకగూడెం, ఫిబ్రవరి 20: కరకగూడెం మండల కేంద్రంలో బస్టాండ్ లేక ప్రజలు అనేక అవస్థలు పడుతున్నారని ప్రజల సౌకర్యార్థం బస్టాండ్ నిర్మించాలని మంగళవారం మణుగూరు డిపో కార్యాలయంలో సీపీఎం మండల కార్యదర్శి కొమరం కాంతారావు వినతిపత్రం అందించారు. బస్ లేటు అయిన సమయంలో ప్రజలు చెట్ల క్రింద, షాపుల ముందు నిల్చుని పడిగాపులు కాస్తున్నారని గుర్తు చేశారు. బస్టాండ్ నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కమటీ సభ్యులు ఊకె నరసింహారావు పాల్గొన్నారు.

పది విద్యార్థులకు టాలెంట్ టెస్టు

భద్రాచలం, ఫిబ్రవరి 20: భద్రాచలంలో మంగళవారం ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు టాటెంట్ టెస్టు నిర్వహించారు. ఇందులో వివిధ పాఠశాలలకు చెందిన 1500 మంది విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభ చాటారు. ఈ టాలెంట్ టెస్టుకు ముఖ్య అతిథిగా పాల్గొన్న భద్రాచలం ఎంఈవో సమ్మయ్య మాట్లాడారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు అభిమన్యు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ భూపేందర్, జిల్లా ఉపాధ్యక్షులు సందీప్, రవీంద్ర, కార్తిక్, అరవింద్, శిరీష పాల్గొన్నారు.

సారా నిర్మూలనకు సహకరించాలి

మణుగూరు, ఫిబ్రవరి 20: మండలంలో నాటుసారాను నియంత్రించేందుకు వలస ఆదివాసీలు, గ్రామీణ ప్రాంతాల ప్రజలు సహకరించాలని మణుగూరు సీఐ సతీష్‌కుమార్ అన్నారు. మంగళవారం ఎక్సైజ్ శాఖ, మణుగూరు పోలీస్‌శాఖల సంయుక్త ఆధ్వర్యంలో పగిడేరు గ్రామంలోని ఇప్పలగుంపు ప్రాంతంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వంహించారు. కేసులపై అవగాహన కల్పించారు. నాటు సారా తయారు చేసిన, విక్రయించిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీస్, ఎక్సైజ్ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

బంజారాల ఆరాధ్యదైవం సేవాలాల్ మహరాజ్

» పినపాక, అశ్వారావుపేట ఎమ్మెల్యేలు పాయం, జారే

అశ్వాపురం/చంద్రుగొండ, ఫిబ్రవరి 20: సంత్ సేవాలాల్ మహరాజ్ బంజారాల ఆరాధ్యదైవమని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మంగళవారం అశ్వాపురంలోని సేవాలాల్ సదన్‌లో ప్రభుత్వం నిర్వహించిన సేవాలాల్ 285వ జయంతి వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడారు. సామాన్యుడిగా జన్మించి, అసమాన్యుడిగా ఎలా ఎదగాల్లో ఆచరించి చూయించిన మహనుబావుడు సేవాలాల్ మహరాజ్ అని కొనియాడారు. గిరిజనులకు కాంగ్రెస్ పార్టీకి మధ్య విడదీయరాని సంబంధం ఉందన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య, ఎంపీపీ ముత్తినేని సుజాత, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు షర్ఫుద్దీన్, తహసీల్దార్ స్వర్ణ, ఎంపీడీవో వరప్రసాద్, మండల కోఆప్షన్ సభ్యుడు ఖదీర్, మొండికుంట ఎంపీటీసీ కమటం నరేష్, నెల్లిపాక సింగిల్‌విండో ఛైర్మన్ తుక్కాని మధుసూదన్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు ముత్తినేని శ్రీనివాసరావు, గా దెకేశవరెడ్డి, సదర్‌లాల్, బంజారా నాయకులు పాల్గొన్నారు.



సేవాలాల్ జయంతిలో పాల్గొన్న ఎమ్మెల్యే జారే

కుల మతాలకు అతీతంగా సంక్షేమం: ఎమ్మెల్యే

చంద్రుగొండ: కులమతాలకు అతీతంగా సంక్షేమం అందేవిధంగా కృషిచేస్తానని ఎమ్మెల్యే జారే ఆదినాయణ అన్నారు. మంగళవారం చంద్రుగొండలో నియోజక వర్గ స్థాయి సేవాలాల్ జయంతి వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమానికి హాజరైయిన ఎమ్మెల్యే వేడుకల సందర్భంగా జరిగిన పూజల్లో పాల్గొన్నారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ సేవాలాల్ జయింతి వేడుకల్లో పాల్గొనటం తనకు సంతోషంగా ఉందన్నారు.కార్యక్రమంలో ఐదు మండలాల బంజరా నాయకులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠ వాయిదా: ఈవో

పాల్వంచ, ఫిబ్రవరి 20: పాల్వంచ మండలం జగన్నాధపురం గ్రామంలోని శ్రీకనకదుర్గ దేవస్థానం (పెద్దమ్మ గుడి) ప్రాంగణంలో ఈ నెల 29న నిర్ణయించిన శివాలయ విగ్రహ ప్రతిష్ఠ ముహూర్తం ఎట్టకేలకు వాయిదా పడింది. మంగళవారం కేశావాపురం- జగన్నాధపురం గ్రామాల ప్రజలు, పెద్దలు, ఆలయ అర్చకులు, పండితులు, పాలకమండలి సభ్యులు, ఆలయ ఈఓ తదితరులు ఈ విషయంపై సమావేశమయ్యారు. సుదీర్ఘ చర్చల అనంతరం ప్రతిష్ఠ వాయిదా వేసి మార్చిలో, లేదా ఆ పై వచ్చే మంచి ముహూర్తాలలో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. దీంతో ఇరుపక్షాల వారు అంగీకరించడంతో ఈవో రజనీకుమారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు.



సమావేశమైన గ్రామస్థులు

బెంగుళూరులో భద్రాద్రి రామయ్య కల్యాణం



బెంగుళూరులో రామయ్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం, ఫిబ్రవరి 20: బెంగుళూరులో భద్రాద్రి రామయ్య కల్యాణం మంగళవారం ఘనంగా నిర్వహించారు. భద్రాద్రి దేవస్థానం ఆద్వర్యంలో శ్రీరామ ప్రచార రథం బెంగుళూరులోని వైట్‌ఫీల్డ్‌కు తరలి వెళ్లింది. స్వామి వారిని అక్కడి భక్తులు దర్శించుకోగా మంగళవారం శ్రీ సీతారామచంద్ర స్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ సమయంలో ముందుగా విశ్వక్సేనపూజ, పుణ్యవచనం, కంకణధారణ యజ్ఞోపవీతదారణ, శుభ ముహూర్తం, జీలకర్ర బెల్లం, మాంగల్యదారణ, తలంబ్రాలు, వేదాశీర్వచనంలో కల్యాణ ప్రక్రియ ముగిసింది. కార్యక్రమంలో దేవస్థానం ఈవో రమాదేవి, ఉప ప్రధాన అర్చకులు అమరవాది శ్రీనివాస రామానుజం, ముఖ్య అర్చకులు పొడిచేటి రామ భద్రాచార్యులు, వేద పండితులు లింగాల రామకృష్ణ ప్రసాద్, సిబ్బంది శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి

కొత్తగూడెం టౌన్, ఫిబ్రవరి20: పదో తరగతి విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టంగా చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని కూలీలైన్ పాఠశాల హెచ్ఎం కల్యాణశర్మ అన్నారు. పదో తరగతి విద్యార్థులకు గౌరి వెంకటేశంగారు అల్పాహారాన్ని వితరణ చేశారు. జమాతేఇస్లామీ హిందూ సభ్యులు షేక్ అబ్దుల్ బాసిత్ మాట్లాడుతూ విద్యార్థుల చేతులో ఉన్న ఆయుధం చదువు ఒక్కటే అని, దాని ద్వారా మనం ఉన్నత శిఖరాలకు చేరుకొని సమాజానికి సేవ చేయవచ్చు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌరు భరత్, క్రాంతిరేఖ, సాల్విని, ఉపాధ్యాయ సిబ్బంది ఊహ, అర్జున్, అజీమా, భాను తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందు ఏరియాలో కార్పొరేట్ అధికారుల పర్యటన

ఇల్లెందుటౌన్, ఫిబ్రవరి 20: సింగరేణి ఇల్లెందు ఏరియాలో మంగళవారం కార్పొరేట్ జనరల్ మేనేజర్లు వర్గాచరయ్య, డీఆర్ దిక్షితులు, వేనుమాధవ్ పర్యటించారు. ఏరియాలోని స్టోర్, జేకే5 ఓసీ, కోయగూడెం ఓసీలను సందర్శించి వినియోగంలో లేని క్రాప్ వివరాలను నమోదు చేసుకున్నారు. వారిని ఏరియా జీఎం జాన్ ఆనంద్ , జీఎం కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఇంజనీర్ నర్సింహరాజు, ప్రాజెక్ట్ అధికారులు వెంకటేశ్వర్లు, ప్రహలాద్, సెక్యూరిటి అధికారి అంజిరెడ్డి, స్టోర్ ఇంజనీరు నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.



కేటీసీలో పర్యటిస్తున్న సింగరేణి అధికారుల బృందం

టీపీహెచ్‌డీఏ జిల్లా నూతన కమిటీ ఎన్నిక

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, ఫిబ్రవరి 20: భద్రాద్రి జిల్లా తెలంగాణ పబ్లిక్ హెల్త్ డాక్టర్స్ అసోసియేషన్ (టీపీహెచ్‌డీఏ) నూతన కమిటీని ఎన్నుకున్నారు. మంగళవారం పట్టణంలోని ఐఎంఏ హాల్లో ఎలక్షన్ రిటర్నింగ్ అధికారి డాక్టర్ శ్రావణ్‌కుమా ర్ పర్యవేక్షణలో ఎన్నిక నిర్వహించారు. అధ్యక్షుడిగా డాక్టర్ బి.బాలాజీ నాయక్, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ బి.శివకుమార్, కోశాధికారిగా డాక్టర్ మురళీ కృష్ణలను ఎన్నుకున్నారు. ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా డాక్టర్ రాకేష్‌కుమార్, డాక్టర్ దినేష్, డాక్టర్ పుల్లారెడ్డి, డాక్టర్ మనీష్‌రెడ్డి, డాక్టర్ కృష్ణదీపక్ రెడ్డి, సహాయ కార్యదర్శులుగా డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ చైతన్య, డాక్టర్ మధువరుణ్, డాక్టర్ రేవంత్, డాక్టర్ సంఘమిత్ర, గౌరవ సలహాదారులుగా డాక్టర్ శ్రీధర్, డాక్టర్ రాజులను ఎన్నుకున్నారు. కొత్తగూడెం డివిజన్ ఉపధ్యక్షులుగా డాక్టర్ కళ్యాణ్, డాక్టర్ ప్రియాంక, భద్రాచలం డివిజన్ ఉపధ్యక్షులుగా డాక్టర్ నిషాంత్‌రావు, డాక్టర్ స్పందనలను ఎన్నుకున్నారు.



నూతన కమిటీ సభ్యులు

చెత్త సేకరణలో నిర్లక్ష్యం వహించవద్దు: ఎంపీడీవో

జూలూరుపాడు/టేకులపల్లి, ఫిబ్రవరి 20: గ్రామాలలో చెత్తను ప్రతి రోజు డంపింగ్ యార్డుకు తరలించి తడి, పొడి చెత్తను వేరు చేసి వార్మికంపోస్ట్ ఎరువును తయారు చేయాలని ఎంపీడీవో కరుణాకర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మండలంలోని సాయిరాంతండా, కొమ్ముగూడెం, కరివారిగూడెం, చింతలతండా, బేతాళపాడు పంచాయతీలను సందర్శించి నర్సరీలను, డంపింగ్ యార్డులను పరిశీలించారు. కార్యదర్శుల నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. మొక్కల పెంపకం పట్ల ఈజీఎస్ సిబ్బంది ప్రత్యేక శ్రద్ధను కనబరచాలని, గ్రామాలలో కూలీలు ఉపాధి పనులకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని అన్నా రు. కార్యక్రమంలో ఏపీవో రవి, టిఏలు జోధ, నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

హరితహారం నర్సరీలను పరిశీలించిన ఎంపీడీవో

టేకులపల్లి: మండలంలోని గొల్లపల్లి, చింతోనిచెల్క, మేళ్ళమడుగు, గంగారం, కిష్టారం, లచ్చగూడెం గ్రామ పంచాయతీలలో హరితహారంలో భాగంగా ఏర్పాటు చేసిన నర్సరీలను ఎంపీడీవో రవీంద్రరావు మంగళవారం సందర్శించి పరిశీలించారు. కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి లక్ష్మీగణేష్ గాంధీ, ఏపీవో శ్రీనివాస్, ఈసీ తిరుపతయ్య, పంచాయతీ కార్యదర్శులు సిద్ధాంతి చిట్టీ, దీప్తి, రాజు, శ్రీహరి, శిరీష, కవిత, టీఏలు స్వప్న, వెంకటరమణ, భీముడు, క్షేత్ర సహాయకులు బాలాజీ, సరిత, సత్యనారాయణలు పాల్గొన్నారు.



టేకులపల్లిలో నర్సరీలను పరిశీలిస్తున్న ఎంపీడీవో

నామమాత్రంగా టాస్క్‌ఫోర్స్ దాడులు

పాల్వంచ, ఫిబ్రవరి 20: రెండు రోజులు జిల్లాలో ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ అధికారులు నిర్వహించిన దాడులు నామమాత్రంగానే జరిగాయని బీఎస్పీ పార్లమెంట్ ఇన్‌చార్జ్ ఎర్రా కామేష్ ఆరోపించారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో జరిగిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో జరుగుతున్న మద్యం సిండికేట్ దందాపై జిల్లా అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా స్పందించకపోవడంతో ఎక్సైజ్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసామని అన్నారు. ఇక్కడ అధికారులకు ముందే సమాచారం చేరవేయడంతో రెండు రోజులు సిండికేట్ స్టాక్ పాయింట్లకు వ్యాపారులు తాళాలు వేసుకున్నారని ఆరోపించారు. దాడులకు వచ్చిన అధికారులు కేవలం ఒక వైన్ షాపునకు మాత్రమే జరిమానా వేసి చేతులు దులుపుకున్నారని విమర్శించారు.

ఉపాధి కూలీల సమస్యలపై నిర్లక్ష్యం వీడాలి

● వ్యకాస నాయకులు రాజు, సాంబశివరావు

మణుగూరుటౌన్, ఫిబ్రవరి 20: ఉపాధి హామీ కూలీల సమస్యలపై ప్రభుత్వం అవలంభిస్తోన్న నిర్లక్ష్య ధోరణిని వీడాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు బొల్లం రాజు, సత్రపల్లి సాంబశివరావు అన్నారు, మంగళవారం గుట్టమల్లారం ప్రాంతంలోని కారం వెంకటయ్య కుంటలో పనిచేస్తున్న ఉపాధి కూలీలతో మాట్లాడారు.

వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎటువంటి కొలతలు లేకుండా ప్రతీ కూలీకి రూ.600, ఏడాదికి 200 పని దినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో హనుమంతరావు, అనుపమ మనిపుష్ప, వెంకటరమణ, లక్ష్మణ్, సాహెబ్ బేగం, రామారావు పాల్గొన్నారు.

వారాంతపు సంత స్థలం కోసం ఎమ్మెల్యేకు వినతి



వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్థులు

అశ్వాపురం ఫిబ్రవరి 20: మండల పరిధిలోని మొండికుంట గ్రామపంచాయతీలో వారాంతపు సంత ఏర్పాటు కోసం స్థలం కేటాయించాలని కోరుతూ మంగళవారం మొండికుంట ఎంపీటీసీ కమటం నరేష్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకు కాంగ్రెస్ నాయకులు వినతిపత్రం సమర్పించారు. నాబార్డ్ ఆర్థిక సహాయంతో చెస్టెడ్ సంస్థ మొండికుంటలో వారపు సంత షెడ్లు నిర్మించేందుకు ప్రతిపాదించినట్లు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య, ఎంపీపీ ముత్తినేని సుజాత, నాయకులు కొండాబత్తుల ఉపేందర్, శ్రీనివాసరెడ్డి, కృష్ణమాచారి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పాయంను కలిసిన డీఎస్పీ, సీఐ

మణుగూరుటౌన్, ఫిబ్రవరి 20: మణుగూరు సబ్‌డివిజన్ పోలీస్ అధికారిగా ఇటీవల బదిలీపై వచ్చిన వీ రవీందర్‌రెడ్డి, మణుగూరు సీఐ సతీష్‌కుమార్ మంగళవారం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యేతో సబ్ డివిజన్, మణుగూరు పట్టణంలో లా అండ్ ఆర్డర్ సమస్యలు, ట్రాఫిక్ సమస్యల నివారణకు చేపట్టవలసిన చర్యలపై చర్చించారు. నియోజకవర్గంలో, మణుగూరు పట్టణంలో ప్రశాంత వాతవరణం నెలకొనేందుకు పోలీస్‌శాఖ తీసుకునే చట్టపరమైన చర్యలకు తనవంతు సహకారమందిస్తానని ఎమ్మెల్యే అన్నారు.

హనుమ ఆలయంలో ప్రత్యేక పూజలు

దుమ్ముగూడెం ఫిబ్రవరి 20: భీష్మ ఏకాదశి సందర్భంగా మంగళవారం లక్ష్మీనగరం అభయాంజనేయస్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుప్రభాతసేవ, పళ్లరసాలతో అభిషేకం, ప్రత్యేక అలంకరణ, తమలపాకుల పూజ, సింధూర అష్టోత్తర సహస్రనామార్చనలను శాస్త్రోక్తంగా జరిపించారు. టీటీడీ-హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో శ్రీరామరక్షాస్తోత్రం, హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. అధ్యక్షులు వీరరాఘవరెడ్డి, టీటీడీ ధర్మాచార్య పిలకా నాగేంద్రరెడ్డి, వెంకటరమణారెడ్డి, సాయిరెడ్డి, లక్ష్మి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి: కలెక్టరుకు మాజీ సైనికుల వినతి



వినతిపత్రం అందజేస్తున్న మాజీ సైనికులు

భద్రాచలం, ఫిబ్రవరి 20: మాజీ సైనికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మాజీ సైనిక సంక్షేమ సంఘం బోర్డు సభ్యులు తిప్పన సిద్దులు ఆధ్వర్యంలో కలెక్టర్ డాక్టర్ ప్రియాంకను కలిసి వినతిపత్రం అందజేశారు. సైనిక ఆరాంఘర్, ఫ్లడ్ రిలీఫ్ సెంటర్ కోసం విన్నవించారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించి ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సైనిక సంఘం అధ్యక్షుడు సుబేదార్ బండారు వెంకన్న, హవల్దార్ ఆర్కే. బెన్హర్, నాయక్ రామ్మోహన్‌రావు పాల్గొన్నారు.

మెనూ పాటించకుంటే కఠిన చర్యలు

» ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య » టేకులపల్లిలోని కస్తూర్బా బాలికల పాఠశాల తనిఖీ

టేకులపల్లి, ఫిబ్రవరి 20:కస్తూర్బా పాఠశాలలో మెనూ పాటించకపోతే చర్యలు తప్పవని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య హెచ్చరించారు. మంగళవారం మండల కేంద్రంలోని కస్తూర్బా బాలిక పాఠశాలను ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇంటర్ విద్యార్థులతో ఆయన మాట్లాడారు. మెను పాటించడంలేదని, అవసరాలకు సరిపడ నీరు లేదని, పాఠశాలలో విద్యుత్ సమస్య కారణంగా చదువులకు ఆటంకం ఏర్పడుతుందని తదితర సమస్యలను విద్యార్థులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఆహారం తయారుచేయడంలో వంట మనుషులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ, విద్యార్థులపై అగౌరవంగా ప్రవర్తిస్తున్నారని ఆయనకు విన్నవించారు. అనంతరం ఎమ్మెల్యే ఆశ్రమ పాఠశాలలో మరుగుదొడ్లు, కిచెన్‌షెడ్లు, పాఠశాల ఆవరణను పరిశీలించారు. పాఠశాలలో నిరంతరం విద్యుత్ సరఫరా చేయాలని విద్యుత్‌శాఖ ఏఈ దేవాను ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్య పోషణ కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన మెనును పాటించని వారిపై చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. వంటలు సక్రమంగా తయారు చేయకుండా బాలికల పట్ల అగౌరవంగా ప్రవర్తిస్తున్న వంటమనుషులను తొలగించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. పిల్లకు ఎటువంటి సమస్య ఉన్న వెంటనే పరిష్కరించాలని పాఠశాల ఎస్‌వో సంతుకు సూచించారు.



విద్యార్థినులతో మాట్లాడుతున్న కోరం

ఆయన వెంట వైస్ఎంపీపీ ఉండేటి ప్రసాద్, టేకులపల్లి మాజీ సర్పంచ్ బోడ సరిత తదితరులు ఉన్నారు.

క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయి

క్రీడలు స్నేహభావాన్ని పెంపొందించడంతోపాటు శారీరక, మానసిక, ఆరోగ్యానికి దోహదపడతాయని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. కనకన్న ప్రీమియర్ లీగ్(కేపీఎల్)సీజన్-1 మండలస్థాయి క్రికెట్ పోటీల ముగింపు సందర్భంగా మంగళవారం టేకులపల్లిలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో వైస్ఎంపీపీ ప్రసాద్, టేకులపల్లి మాజీ సర్పంచ్ సరిత, టేకులపల్లి, బోడు ఎస్ఐలు సైదా రావూఫ్, శ్రీకాంత్, క్రీడా పోటీ నిర్వహకులు బోడ మంగీలాల్, మూడు గణేష్, అఖిల్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఇంటర్మీడియట్ కీలకం: కూనంనేని, రాందాస్‌నాయక్

చుంచుపల్లి, ఫిబ్రవరి 20: విద్యార్థులకు ఇంటర్మీడియట్ దశ ఎంతో కీలకమని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్‌లు అన్నారు. మంగళవారం చుంచుపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో, ప్రణాళికబద్ధంగా ముందుకు సాగినట్లు అయితే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చు అన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కత్తి రమేష్, అధ్యాపక సిబ్బంది బండి వెంకటేశ్వరరావు, లక్ష్మణ్‌రావు, సముద్రాల శ్రీనివాస్, సీపీఐ జిల్లా కార్యదర్శి షేక్ సాబీర్‌పాషా, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని



మాట్లాడుతున్న వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

పార్క్‌ను సుందరంగా తీర్చిదిద్దుతాం: ఎమ్మెల్యే కోరం

ఇల్లెందుటౌన్, ఫిబ్రవరి 20: ఆహ్లాదకరమైన వాతావరణంలో చిన్నపిల్లలతో గడిపేందుకు లేక్‌వ్యూ చిల్డ్రన్ పార్క్ ఎంతో ఉపయోగపడుతుందని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. మంగళవారం పట్టణంలోని చెరువు కట్ట ఏరియాలో నూతనంగా ఏర్పాటు సూమారు రూ.3.50 కోట్లతో నిర్మించిన లేక్‌వ్యూ పార్క్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ.. సాయంత్రం సమయాల్లో పిల్లలతో సరదాగ సమయం గడిపేందుకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఇల్లెందు పట్టణానికి తలమానికంగా ఉండేందుకు లేక్‌పార్క్‌కు అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు. పార్కును అభివృద్ధి చేసేందుకు నిధులు కేటాయిస్తామని తెలిపారు. పార్కులో పిల్లల కోసం స్విమ్మింగ్‌పూల్, రైన్‌బాత్ సౌకర్యాలు కల్పించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు ఆయన తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్‌దమ్మాలపాటి వెంకటేశ్వరావు, కమిషనర్ నవీన్, మేనేజర్ అంకుషావళి, వివిధ వార్డుల కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

వాసవీ టెంపుల్స్ సెమినార్‌లో అశ్వారావుపేట 'అమ్మవారు'



సెమినార్‌లో అశ్వారావుపేట అమ్మవారు ప్రదర్శన

అశ్వారావుపేట, ఫిబ్రవరి 20: శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి జన్మస్థలమైన పెనుగొండలో జరుగుతున్న అఖిలభారత వాసవి టెంపుల్స్ సెమనార్‌లో అశ్వారావుపేటకు చెందిన శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఉత్సవ విగ్రహాల ప్రదర్శన జరిగింది. మూడు రోజులుగ ఏపీలోని పెనుగొండలో అఖిల భారత వాసవి టెంపుల్స్ సెమినార్ జరిగింది. ఈ సెమినార్‌లో దేశవాష్టంగ ఉన్న వాసవి ఆలయాల్లో కొలువై ఉన్న అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను ప్రదర్శించారు. ఈ ప్రదర్శనలో అశ్వారావుపేట ఆలయ అధ్యక్ష కార్యదర్శులు ముత్తా సుమాకర్, పసుమర్తి వైకుంఠం, అర్చకులు అచుతశర్మలు అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ప్రదర్శించారు. అమ్మవారి నామ పారాయణంతో పరిసరాలు మారమోగిపోయాయని ఆలయ ఛైర్మన్ ముత్తా సుమాకర్ తెలిపారు.